పుస్తక సమీక్ష

# చిట్టిపిల్లల పొట్టి పొట్టి గేయాలు..




తెలుగు అధ్యాపకులు, కవి, బాల సాహిత్య సృజనకారులు పెండోట వెంకటేశ్వర్లుగారి సంపాదకత్వంలో.. **'మర్కూక్ మాణిక్యాలు'** బడిపిల్లల కవిత, గేయ సంకలనాన్ని వెలు వరించారు.

సిద్దిపేట జిల్లా మర్కూక్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులచే రాయించిన కవితలు గేయాలను ఏర్చి కూర్చి ప్రకటించిన ఈ చిన్ని పుస్తకంలో పొందుపరిచారు. పిల్లలకు చదువుతో పాటు బాల సాహిత్య సృజనపై ఆసక్తిని కలిగించి.. కవులు, రచయితలుగా ఎదిగేందుకు వారికి తగు రీతిలో మార్గదర్శన మిస్తున్న ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు అభినందనీయులు– కల్మషం అసలే తెలియని చిన్నారుల అంతరంగంలో కదలాడే భావాలకు అక్షరాకృనిచ్చేలా.. శిక్షణనిస్తూ వారిని ముందుకు తీసుకెళ్ళడం స్వాగతించదగింది. బాలలను కవులుగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్ష బలంగా ఉండటమే కాదు.. కార్యరూపంలో ఆచరించి చూపుతున్న పెండోట వెంకటేశ్వర్లుగారు.. అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సంకలనంలో.. పిల్లలు సృజన చేసిన రచనలో వారు ఎంపిక చేసుకున్న కవితా వస్తువులు.. పిల్లల మనో వికాసానికి దోహదపడేలా ఉన్నాయి.

ఆట, మాట, పాట అంటే అమితంగా ఇష్టపడే పిల్లల సర్వాంగీణ ఉన్నతికి.. వారి వ్యక్తిత్వ వికాసానికి ఉపకరించే విధంగా ఇందలి గేయాలి.. కవితలు కొలువుదీరాయి. మొక్కలను నాటి సంరక్షించాలని పూససుప్రియ పిలుపునిస్తే.. స్నేహం యొక్క గొప్పతనాన్ని అబ్బసాని స్రవంతి తెలియజెప్పింది. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటూ పుట్టనవ్య రాస్తే.. బడి ప్రాశస్త్యాన్ని తుమ్మల ప్రవళిక వివరించింది. తిప్పతి కళ్యాణి దీపావళి గురించి రాసింది. పాఠశాల శీర్షికతో కన్నెమైన సాయినీల రాస్తే.. సంక్రాంతి పండుగ వైశిష్ట్యాన్ని బొమ్మ శిరీష తన కవిత ద్వారా తెలియజేసింది.చెట్లను నరకవద్దని కెన్వర్ సంజన పిలుపునిస్తే ప్రకృతిని మురిపించే వర్షం కురవాలని కానమైన మమత కాంక్షించారు. అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక అయిన ఆటల గురించి, గుర్రాల అనిల్ చెట్టు గురించి, అమ్మ ప్రేమ గురించి జంగిటి శారద కవితల్ని గేయాల్ని మెప్పించారు. వర్షం గురించి బబ్బురి వీణ, అమ్మపై బుడిమల్ల సందీప్, మంచోడు శీర్షికతో చింతకాయల దివ్య, పండుగల గురించి లింగంపల్లి ప్రేమ్‌కుమార్, పుస్తకం గురించి రాళ్ళబండి శ్రీధరాచారి రచనలు చేశారు.

మాటల ఊట పేరుతో బొమ్మ మనూష, పెన్నిధి గురించి గుంటినందిని, రాఖీపండగ గురించి కానమైన శ్యామల, అమ్మ శీర్షికతో దర్శనాల శిరీష రాసింది.

పుస్తకం సంతోషాలను పెంచుతుందని రాళ్ళ బండి రాణిఅంటే.. అమ్మా, నాన్న, గురువులను దేవుళ్లుగా దండు పూజ ఆవిష్కరించారు.

మట్టి వినాయకుని గురించి బుల్లె అంకిత మరియు 'ఆడపిల్ల' పేరుతో మర్రెంగల జయలక్ష్మి రాసిన గేయం లయబద్ధంగా గానం చేయడానికీ.. అభినయించడానికి యోగ్యంగా ఉంది. విభిన్న కోణాల్లో 'అందం'ను ఉస్కెల శ్వేత ఆవిష్కరిస్తే.. చదివితేనే బాగు బాగు.. బట్టీ కొట్టవద్దని, కాపీ కొట్టవద్దని చిట్టితల్లికి పెంబర్తి పూజ హితవు పలికింది. దాండియా గురించి నల్లగొండ పూజ రాస్తే.. అమ్మే సృష్టికి మూలం అని కామురవెల్లి మహేశ్వరి తేల్చి చెప్పింది. నాన్నే నా మార్గదర్శి అంటూ కొంట్యాల అనూష నినదిస్తే.. గణపతిని కీర్తిస్తూ కణ్ణాయి రేణుక రాసింది.మానవతా విలువలను బచ్చలి సమీర వల్లెవేస్తే.. నాన్న యొక్క ఔన్నత్యాన్ని కాశీపేట సౌమ్య చాటి చెప్పింది.

ఆడుతూ పాడుతూ చదవాలని మీసాల అంజలి అంటే.. ఇంటి చుట్టూ చెట్లను పెంచాలని నూన్‌వార్ శ్రావణి హితవు పలికింది. చెట్లను నరకవద్దని చేబర్తి భరత్ రాస్తే.. అమ్మ ప్రేమ జలపాతం. అమ్మ మాట మధురం అంటూ గౌరెల్లి రేణుక రాసింది. అన్న చెల్లెలి అనుబంధాన్ని బొల్లబోయిన సౌమ్య స్ఫూర్తిదాతగా తమ నాన్నను వర్ణిస్తూ గుర్జకుంట శ్రీనివాస్ రాశాడు.

గురవుల బాట నడవాలని కర్రోల్ల సుస్మిత సూచిస్తే.. వినాయకుడు మనకు విజయాలు చేకూర్చుతాడని లింగవిష్ణువర్ధన్ వివరించాడు.

వానాకాలం పేరుతో తుమ్మల అనిల్‌కుమార్ రాస్తే అమ్మను ఉన్నతంగా చిత్రిస్తూ పుట్టకీర్తన తన గేయాన్ని కొనసాగించింది.

జిల్లా, మండలం గురించి అవగాహనకల్గిస్తూ తలారి మహేశ్వరి రాస్తే.. బల్ల జాహ్నవి చిట్టి పొట్టి బాలిక అంటూ తమ గేయాన్ని ప్రారంభించింది. చదువుతోడన్ అన్నీవస్తాయని పెంబర్తి అశ్విని అంటే.. వానల వల్ల ఒనగూరే లాభాన్ని బొమ్మ అఖిల్ వివరించాడు.

చీమల దండు క్రమశిక్షణను గద్దల అఖిల్ మరియు పాపోల్ల నాగచైతన్య వర్ణిస్తే.. కుందేలు గురించి అచ్చంగారి పల్లవి రాసింది. రైతుల సేవలను రాజమైన యశ్విత్ ఏకరువు పెడితే...

అమ్మ, నాన్న, చెల్లి, తమ్ముడు, పూలతోట, మొక్కలు నాటుట, పూలు తెంపుట, పూల వాసన నాకిష్టం అంటూ ఎంపటి పల్లవి రాస్తే.. పూలు పండ్లు గురించి నీలం భానుప్రకాశ్ రాసాడు చక్కటి పాటు పేరుతో అంగడి అక్షయ్, కాకి గురించి లబ్బోల్ల ప్రవళిక, ప్రతియేడు పేరుతో కొట్టాల అఖిల, బొర్రగణపతి గురించి ఇస్కంట తేజశ్వి, తుమ్మెదపాట పేరుతో గద్దల సునీల్, ప్రసాదం గురించి పత్తిసౌమ్య, చెట్లు గురించి బాలమైన భానుప్రసాద్ రాశాడు.

పై గేయాలతో పాటు.. అచ్చంరాజ్‌కుమార్, పుట్టమానస, గుర్రాల రజిత, అచ్చంగారి విష్ణు, దాసరి ఆకాంక్ష, భూమక అనూష, గుర్రాల కీర్తన, బైరగోని సోని, సుర్విత వివేకానందగౌడ్, కానమైన భానుప్రియ, చింతకింది స్నేహ, వలపు విఘ్నేశ్వరి, నరిగెభవాని, బి. సాయికుమార్, దర్శనాల వంశీ, ఎంపటి ప్రశాంత్, తత్తరి నవీన్, నరిగె కిరణ్, అర్కల కవిత, తుప్తతి అశోక్, రెడ్డమైన అఖిల, పోకల విజయ్, బాసాదం ఐశ్వర్య, గుండమైన అఖిల, గజ్జెకుంట గణేశ్, పెంబర్తి రఘువంశీ, పోకల స్పందన, బోబయిన సాయికుమార్, బొద్దుల స్వర్ణలత, జి. భరత్, భోగవైష్ణవి, లింగంపల్లి శ్వేత, తదితర బాల బాలికలు రాసిన గేయాలు.. కవితలు పుస్తకానికి శోభను కూర్చాయి. ఇంకా ఇందులో 6,7,8 తరగతులకు సంబంధించిన చిన్నారుల కొండి నందిని, పాపోల్ల రేణుక, వల్లపు మానస, బాసాడం ఐశ్వర్య, గుండమైన అఖిల,గజ్జెకుంట గణేశ్, పెంబర్తి రఘువంశీ, పోకల స్పందన, పదిరి రేవతి, చిట్టమైన భానుప్రసాద్, దండుదివ్య, కానమైన జయశీల, కొట్టాల వైష్ణవి, కానమైన రేణుక, ఎల కావ్యాంజలి రాళ్ళబండి హాసినిలు రాసి గేయాలున్నాయి.

పుస్తకం చివరలో అనుబంధకవులు శీర్షికలో 12 కవితలు కొలువుదీరాయి. వీటిని పి. నవ్య, జి. లావణ్య, జి.సౌమ్య, ఆర్.కాంక్ష, రాంచందన, యం.భార్గవి, కంచి వంశీ, మీస అఖిల,కె.రవళి, కిష్టాపురం పూజ, మల్లమారి సుప్రియ, దండ్ల కల్పన తదితరులు రాశారు.

ముఖచిత్రంతో వెలువడిన ఈ చిన్ని పుస్తకంలో చిన్నారులు రాసిన గేయాలు కవితలున్నాయి.

పిల్లల్లో సృజనాత్మకతను పెపొందిస్తున్న పెండోట వెంకటేశ్వర్లు గారికి, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మర్కూక్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేద్దాం.

ఈ పిల్లల రచనలను ఇంతటితో ఆపకుండా.. వారు మరింత గాఢంగా రాయడానికి అవసరమైన మార్గదర్శనం ఉపాధ్యాయులు అందిస్తారని ఆశిద్దాం.

**ప్రతులకు:** జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మర్కూక్,& శ్రీవాణి సాహిత్య పరిషత్
7-128/3, శ్రీనగ్‌కాలనీ
సిద్దిపేట–502103
సెల్: 94405 24546



**– దాస్యం సేనాధిపతి**
94405 25544

## గురువు -మొగ్గలు

ఏమి రాయని నల్ల బల్లపై సుద్దముక్క తానై
ప్రపంచ జ్ఞానాన్ని పొందుపరుస్తూ ఉంటాడు
తరగతి గదిలో అద్భుతాలు సృష్టించే గురువు

మట్టి ముద్దలను వివిధ రూపాలలో నిలిపి
నిండైన మూర్తిమత్వాన్ని ఆపాదిస్తుంటాడు
మట్టిలో మాణిక్యాలను వెలికి తీసే గురువు

భిన్న సంస్కృతులను ఒకే వేదికపై ఐక్యం చేసి
వారసత్వ సంప్రదాయాలకు వారధి అవుతాడు
భారతీయ ఔన్నత్యానికి దిశా నిర్ధేశి గురువు

ఒక వైపు తన కుటుంబ బాత్యలను మోస్తూ
విద్యార్థులే వసుదైక కుటుంబమని భావిస్తాడు
ప్రేమ, వాత్సల్యానికి నిలువెత్తు రూపం గురువు

తనకు ఆరోగ్య ,ఆర్థిక ఇబ్బందులెన్ని ఉన్నా
పిల్లలకు ఆర్థికంగా ఆదుకుంటూ నడిపిస్తాడు
కష్ట ,సుఖాలలో అలుపెరుగని బాటసారి గురువు

**–కయ్యూరు బాలసుబ్రమణ్యం**
7780277240

## ఒక చెడు .. ఒక మంచి

కరోనా వచ్చెను లాక్ డౌన్ తెచ్చెను
కమ్మని వంటలు వండించెను అమ్మ చేతితో
అందరికి పంచమని చెప్పెను దారిలోన
ఆదుకునే నాకు ఆదరణ నేర్పెను
ఆకలైన వారికి అది పంచమని చెప్పెను
అందరిని ప్రేమించమని చెప్పెను
ఆత్మీయ అనురాగాలు పెంచెను మా ఇంటిలోన?.
అరోగ్యంగా ఉండాలని చెప్పెను
హద్దులు దాటవద్దని చెప్పెను
అందరి మేలుకోరే మా చిట్టి మనసులకు..



**–గుమ్మడి. అభిషిక్త్ పాల్**
నిర్మల సిబియస్‌సి, మంగళగిరి
3 వ తరగతి
9440125495

## సృష్టి

భగవత్ స్రష్ట బ్రహ్మ
జగత్ సృష్టి అమ్మ

గర్భంలో బొమ్మ
పొత్తిల్లలో చిగురు కొమ్మ

అతిమధురం అమ్మ
అనురాగవనం అమ్మ

నడిచే దేవత అమ్మ
నడిపించే నమ్మకం అమ్మ

తరాలు మారినా
యుగాలు గడిచినా
అమ్మ పాదాలచెంతే
ఏ బిడ్డ జన్మైనా.

వెయ్యేల అమ్మను పొగడంగ
'రోజు'లేల అమ్మను తలువంగ



**–పల్లెర్ల నిరంజన్ రెడ్డి**
9493123129

## భారత భావిపౌరులు

పిల్లల్లారా బడి పిల్లల్లారా!
భారత భావి పౌరుల్లారా!!
మీరే రేపటి భారత దేశ పాలకులు
మీరే రేపటి భారతదేశ రక్షకులు

గొప్ప గొప్ప చదువులెన్నో చదవాలి
మీ మేధస్సు తో భరతభూమి వెలగాలి
కన్నవారి కలలు తెలుసుకోవాలి
ఆ కలలు నిజం చేయ ప్రతినబూనాలి

తల్లిదండ్రులను గురువుపెద్దలను గౌరవించాలి
వినయవిధేయత సంస్కారంతో మెలగాలి
పదుగురిలో మీ గొప్పతనం పరిమళించాలి
ఎదుగుతూనే మీరంతా ఒదిగి ఉండాలి

సత్యం ధర్మం సమతా మమతా మరవద్దు
నీతి నిజాయితీ సేవానిరతి విడవద్దు
మంచితనం మానవత్వం మార్గంలోనే నడవండి
బీద సాదలను ఆదరించడం మరవకండి

కులమతాలు మీ మనసుకు అంటకూడదు
కలనైనా చెడు యోచన చేయకూడదు
మల్లెలాగ మీ అందరి మనసులుండాలి
భరతమాత మీ ప్రతిభచూసి పొంగిపోవాలి.



**–బూర దేవానందం**
9494996143

## కరోనా!

చేతులు కలిపితే చేటు
మూతులు కలిస్తే ముప్పు
కరోనా కష్టకాలంలో
కౌగిలింతలు పెద్ద తప్పు.

బ్లాక్‌మనీ ఉన్న వాళ్ళకే
కార్పోరేట్ ఆస్పత్రులు
నాడే కాదు నేడు కూడా
ప్రజలకు 'గాంధీయే'దిక్కు.

ఇంటిలో ఉండలేము..!
బయటికి వెళ్ళలేము
త్రిశంకు స్వర్గం కాదు
కరోనా నరకం ఇది.



**– వేముల ప్రభాకర్**
9533120533



# బాల వికాసం

### బాల గేయం
## ప్రకృతి ప్రసాదం

*ప్రకృతి ప్రసాదమే చెట్లు*
*ప్రగతి ప్రాసాదమే చెట్లు*
*వాటిని కాపు కాయాలి!*
*వనాల రక్షణ చేయాలి! ॥ప్ర॥*

*మండే ఎండలనీడలనిచ్చి*
*కాలే కడుపుకు ఫలాలనిచ్చి*
*కనిపించే ప్రత్యక్ష దైవముగ*
*కనికరించేవి చెట్లు–చెట్లు!*

*ప్రాణవాయువుల నందించే*
*మానవాళినే రక్షించే*
*ప్రధాన భూమిక చెట్లు*
*ప్రకృతి మౌలిక చెట్లు! ॥ప్ర॥*

*మన గుమ్మానికి పచ్చతోరణం*
*మందు మాకులకు మూలకారణం*
*మంచి నిదురకు మంచముకైనా*
*మరణించినచో పాడెకుయైనా*
*చెట్లే అన్నిటి కాధారం!*
*పలు లాభాలకేదారం!*
*అందుకె చెట్లను పెంచాలి!*
*హాయిగ యిల జీవించాలి! ॥ప్ర॥*



**– డా॥ వడ్డేపల్లి కృష్ణ**
9246541699

## అమ్మంటే అమ్మేరా

అమ్మంటే అమ్మేరా
అమ్మకు సాటెవ్వరురా
అమ్మను మించిన దైవం లేదురా
ప్రేమకు ప్రతిరూపం అమ్మేరా
త్యాగమంటే అమ్మేరా
సహనమంటే అమ్మేరా
అమ్మంటే అమ్మేరా
అమ్మకుసాటెవ్వరురా
లాలపోసి జోలపాడి
పాలిచ్చి పెద్దచేసి
చేయిపట్టి నడక నేర్పి
లోకం చూపినదే అమ్మ
పిల్లల బాధలను తన బాధగ మలుచుకునేదే అమ్మ
పిల్లల సుఖమే తన సుఖమని
తలచి పులకించెదే అమ్మ
అమ్మంటే అమ్మేరా
అమ్మకుసాటెవ్వరురా
తన సంతానమే తన స్వర్గమని
తలచేదే అమ్మ
పిల్లల్ని తన కనురెప్పలపై మోసేదే అమ్మ
అమృతాన్ని దోసిళ్ళతో పంచేదే అమ్మ
బిడ్డల మంచిని, కోరేదే అమ్మ
అమ్మంటే అమ్మేరా
అమ్మకు సాటెవ్వరురా
అమ్మదనమే అమ్మకు ఆనందం
ఆదరణే అమ్మకున్న సుగుణం
అమ్మను ఎవరికైనా మరువ తరమా
అమ్మను మరచి వుండగలమా
అమ్మను మించిన నమ్మకం వున్నదా
అమ్మ మనసు కన్న
మంచి మనసు దొరుకునా
అమ్మంటే అమ్మేరా
అమ్మకు సాటెవ్వరురా



**–ఎస్ .ఎమ్ .షరీఫ్**
9618045319

## బాలల్లారా

బాలల్లారా రారండి
ఆటలు ఎన్నో ఆడండి
!! బాలలు!!
చేతిన కర్రను పట్టండి
చిర్రగోనే ఆడండి
సందులన్ని తిరగండి
దాగుడు మూతలు ఆడండి
!! బాలలు !!
బ్యాటుతో బంతిని బాదండి
ఫోర్లు, సిక్సర్లు కొట్టండి
వెన్నెల వెలుగుల కదలండి
ఆటలతో దృఢత్వం పోందండి
!! బాలలు !!

**–ఉంగ్రాళ్ళ రాజేశం**
9966946084

## బడి సమయం

బడి సమయం మూగబోయింది
గంటల గణగణలు, పిల్లల గలగలలు
రంగురంగు సీతాకోక చిలుకల రెక్కల చప్పుళ్ళు
విరబూసిన పూల వనాలు
పచ్చధ(ధ)నంతో వూగే తరులు బావురుమంటున్నాయి
ఆవరణంతా స్థబ్దత నిపుకొంది
సగం తెరచిన తలుపులు
సొలీడు వలలతో తరగతి గదులు
రాయని నల్లబల్లలు
భయం భయంగా తలిదండ్రుల ప్రవేశాలు
బిక్కు బిక్కుమంటూ పిల్లలు
ఆప్తులెవరో చచ్చిపోయినట్లు
తెలిసిన వారికి సంతాపదినాలు ప్రకటించినట్లు
విద్యాలయాలు..
అరాకొరగా వచ్చినా మాస్కులతో పిల్లలు
అంతరిక్ష వాసుల్లా
భయం భయంగా అపరిచిత వ్యక్తుల్లా
అంతరాలు విడిచి మాట్లాడుకోలేరు
దూరం దూరంగాబెంచీలు
సామాజిక దూరం.. సానిటైజర్ల సాన్నిహిత్యం
బూట్లు, డ్రస్‌లు, పాఠ్యపుస్తకాలు
టాయ్‌లెట్‌లు, వసతులున్నా
హాయిగా వాడుకోలేని సందిగ్ధావస్థ
గోడలకు బిగించిన అంతర్జాల టీవీలు
చేతుల్లో ఎలుకలు (మౌసులు)
మెరపు తెరలపై పాఠాలు
చూసి చూసి అలసిపోయే మెదళ్ళు
ఆడుకోవటానికి లేని వసతులు
ఆశలపై ఆంక్షలు–ఆకాశాన్నందుకొనే ఫీజులు
కనబడని తలబరువులు
దడిపించే కరోనా కొరడాదెబ్బలు
తెల్లని దుప్పటి కప్పుకొన్న శవపేటికల్లా
దిగాలుగా.. ఈ విద్యాసంవత్సరం
గండం గడిచేదెలా? అని తలలు పట్టుకొన్నా పాలకులు
బడి సమయం.. మూగబోయింది
మహమ్మారి మారణహోమంలోసమిధగా మారింది
పాఠశాలలు క్వారంటైన్ హాళ్ళుగా...

**–లక్కరాజు శ్రీనివాసరావు**
సెల్: 9849166951

## త్యాగజీవి అమ్మ

పేగుబంధం అమ్మ
ప్రేమ చూపును అమ్మ
బుద్ధిచెప్పి, బుజ్జగించి
బువ్వపెట్టును అమ్మ

ఆప్యాయతను పంచునది
ఆది గురువై నిలుచునది
సహృదయంతో అమ్మ
మంచి నడవడి నేర్పునది

వేకువజామున లేచును
ఇంటిని శుభ్రం చేయును
అలుపు లేకుండ అమ్మ
అహర్నిశలు కష్టించును

ఔదార్యం చూపును
అక్కున చేర్చుకొనును

కుటుంబ క్షేమం కొరకే
అమ్మ తపన చెందును

కష్టసుఖాల్లో తోడు
వెన్నంటి నిలిచి ఉండు
త్యాగజీవిగా అమ్మ
ఇలపైన వెలుగుతుండు



**–కందుకూరి భాస్కర్**
9703487088

## శిశిరంలో వసంతం

అవును, నేను పేదను, మామూలు పేదను గాదు
నిరుపేదను, పేదరికానికే చిఋనామా ను !

నాడు నోటు ప్రవాహంలో ఓటి ఓడను నడపనూ లేదు
నేడు నోటు నీటిని మూట గట్టిందీ లేదు !
నేడు బతుకు బండి ప్రయాణంలో ఓడ బండి గాలేదు !
అందుకే పేద వాడిగానే మిగిలాను, ఇలా !!

'కొంత తగ్గి' అందలాలెక్కే అవకాశాలున్నా
'ఆ కొంత' తగ్గించుకునే నేర్పరితనం లేనోన్ని!
సంపాదనంతా దాచుకునే కాపాయం లేనోన్ని
సంపాదించడమంటె 'ఆ నలుగురు' అని అనుకునే వాన్ని!!

బంధాల బంధంకై పరితపించినోన్ని
అనుబంధం ఆత్మీయతలను కోరుకున్న వాన్ని!
బంధుత్వం రాబంధుత్వం కావద్దని, కాకూడదని
జీవితం వసంత బు?తు కోకిలై మధుర గీతాలు ఆలపించగా,
బుతు రాగాల కూజితాలు జీవనరాగాలలో
స్వరలయలై పల్లవించాలని ఆశించిన వాన్ని!!

కొండంత దురాచారాన్ని దూరం విసిరి
గోరంతైనా? సదాచారాన్ని దరికి తీసుకున్నోన్ని!
మానవ విలువల విత్తనాల్ని వెదజల్లి
హృదయ క్షేత్రంలో మె?లకెత్తించుకున్నోన్ని !!

కాని? ఎవరనుకున్నారు ఇట్లౌనని
నమ్మి నానవోస్తె పుచ్చి బుర్రలైనట్లు !
నమ్మి నీకు పెత్తనమిస్తే, నమ్మకాన్ని పోగోడ్తివి
కలసి మెలసి వుందమంటె మా ఉనికినే నువ్ సైసనంటివి !!

శిశిరంలో శ్యామల వర్ణ చిగురులు మేస్తూ కొమ్మల్లో దాగిన కోయిల
వసంత గీతానురాగాలు కురిపించ బిగువా!
ఐతే? మరల వచ్చే వసంతానికి, చిగురే కాదు
కొమ్మలూ రెమ్మలూ దినే రాకాసి కోయిల రావచ్చు?జాగ్రత్త సుమా!!

పూరేకుల వంటి ముదువైన హృదయాన చురకత్తుల దింపినావు!
సూటిపోటి మాటలతో మనసును విరిచేసినావు!!

అయినా? దిగంతాలకావలివైపున క్షితిజ రేఖ మీదుగా
విచ్చు కుంటున్న కాంతి పుంజాల వలె !
శిశిర 'దిరిసెన' ధవళ పుష్పాల హృదయ గాయాల మాన్పించ
నరుదెంచునాబాల ససపా నినిని యని
మత్త కోయిలల మధుర కూజితాల వీవనలు వీయగా !!!



**–ది సత్యావతి**
9440372842

## నిత్య స్మరణీయులు



**–దోరవేటి**
సెల్:9866251679

### 2. నాన్న

ఉ॥ అండమునందు జీవముగనై ప్రభవంబుకు కారణంబునై
నిండు మనంబుతోడ గమనించుచు సద్గుణదీప్తి జేసి నా
కండగనుండి వృద్ధికె ననంత ప్రసిద్ధికి మూలమైన దే
వుండని తండ్రి పాదముల బూని యెదన్ ప్రణుతింతు నిచ్చలున్.

కం॥ పసితనముకు సౌమ్యుడవు! వ
యసు వచ్చెడి సమయమునకు యముడవు! సస్నే
హ సముడవు యౌవనంబుకు!
నసమాన గుణాత్మ! వందనంబులు తండ్రీ!

ఉ॥ నీ సుఖమెప్పుడైన గమనింతువొ లేదొ! తదేక చిత్తువై
మా సుఖ భాగ్యముల్ దలచి మాన కెప్పుడు కష్టజీవివై
జేసిన సర్వకార్యముల చేతనె నేను సమస్త మోదముల్
గాసిలకుండ నొందుచు సుఖమ్ముల గాంచుచునుంటి
నిప్పుడున్.

తే॥ నీవు చేసిన త్యాగమ్ము సేవలన్ని
యందుకొని యెక్కియున్నాను అందలమ్ము
మరువ నెప్పుడు నిన్ను నా మనసునందు
ప్రత్యుదయము నిన్ ప్రార్థించు సుతుడ నేను!


వాసా ఫౌండేషన్
మరియు
నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో
ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి



స్మారక కవితల పోటీలు
కరోనా మహమ్మారి విజృంభన నేపథ్యంలో
ప్రజలెదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై దృష్టి సారించి
"వలస కార్మికులు"
అన్న అంశం మీద మీ కవితాస్త్రాల్ని సంధించండి

బహుమతుల వివరాలు:
- మొదటి బహుమతి : రూ.5000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- రెండవ బహుమతి : రూ.2,500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- తృతీయ బహుమతి : రూ.1,000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- 10 ప్రోత్సాహక బహుమతులు: రూ.500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం

పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం

బహుమతులు గెలుచుకున్న కవితలతో పాటు ప్రచురణకు ఎంపికచేసిన కవితలను 'నేటినిజం'లో ప్రచురించబడును.

నిబంధనలు:
1) కవిత 25 లైన్లకు మించకూడదు.
2) వలస కార్మికుల సమస్యలపైనే ఉండాలి.
3) అనువాద కవితలు పోటీకి అంగీకరించబడవు
4) కవితను ఏ పత్రికకు పంపలేదని, సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని ఈ పోటీ నిమిత్తమే రాసినదని హామీ తప్పక జత చేయాలి.
5) హామీ పత్రంతో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా తప్పని సరి.
6) ఒకరు ఒక కవితను మాత్రమే పంపవలెను.

కవితలు పంపవలసిన చిరునామా:
'నేటినిజం' దినపత్రిక, ఎస్.ఆర్.టి–74, జవహర్‌నగర్, హైదరాబాద్–20.
E-mail : netinizam2020@gmail.com
కవితలు పంపాల్సిన చివరి తేదీ : 15-7-2020

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
గురువారం 9-7-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

## నమ్మలేని నిజాలు

మన ప్రధాని
సంస్కరణల బ్రహ్మ
దేశ బంధువు

హరిత లాస్యం
ప్రజా జీవన భాష్యం
ధ్వంసం విధ్వంసం

వంద రోజులు
ఉపాధికి ఊరట
తిండికి దారి

ప్రాణ దాతలు
కనిపించే దేవుళ్లు
రూకల దాహంత

కొత్త వంగడం
సృష్టికి ప్రతి సృష్టి
ప్రగతి పథం



- రేడియమ్
సెల్: 9291527757

## శ్రీనిజాలు

టెస్టుల్లో పాజిటివే
పెరుగుతుంటె పెక్కు !
దిక్కు ఏది లేకుంటే
లాక్ డౌనే దిక్కు !

తిరుగుతుంటె దూరుతుంది
కరోనా ఒంట్లో !
కాలు బయట పెట్టకుండ
పొదగండి ఇంట్లో !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# అస్తిత్వ-చేతనా నినాదం 'నిర్నిద్ర గానం'

పుస్తక సమీక్ష




బహుశః ఈ మధ్యకాలపు కవిత్వమంతా అస్తిత్వ స్పర్శ కలిగిందే. దళిత, అణగారిన వర్గాల కవిత్వం, స్త్రీవాదం, మైనారిటీవాదం. ప్రాంతీయతావాదం ఇలాంటి అనేక అస్తిత్వోద్యమాల కూడలి ఇవాల్టి సాహిత్య సందర్భం. ఏ మార్గానికైనా ప్రాతిపదిక, ప్రవాహ పరిపూర్ణ దశ లుంటాయి. ఒక లక్ష్యంతో ప్రారంభమైన అడుగు ఆ మార్గం బల పడటానికి అనేక అంశాలని స్వీయకోణంలోంచి అన్వేషించి, ఆవిష్కరించి అనుసరిస్తుంది.

తొలినాళ్ల స్త్రీవాద కవిత్వానికి కొన్నిమూల బిందువులున్నాయి. బహుశః ఏ అస్తిత్వానికైనా ఉంటాయి కూడా. మొదట్లో అణచివేతని దానికి కారణమైన పైతృక సంస్కృతిని వాటికి ఉనికినిస్తున్న పురాణ, చారిత్రకాంశాలని దిక్కరించి తిరస్కరించింది. ఆ క్రమంలోనే సమాజ సంబంధమైన అంశాలను, వైరుధ్యాలను చేజిక్కించుకుంది. ఈ క్రమంలో మూలబిందువులను, కేంద్రభాగాన్ని కొన్ని అంశాల నుండి, అర్థం చేసుకోవచ్చు.

1. నినాదమై– చరిత్రను సంస్కృతిని నిలదీసేది.
2 జీవితంలో సారాన్ని, అణచివేతని కరుణపూరితంగా చెప్పేది.
3. జీవిత సాఫల్యం కోసం ప్రేరేపించేది.

కొండపల్లి నీహారిణి సంపూర్తిగా కొత్త గొంతుకేమీ గాదు. గతంలో 'వ్యాస హారిక', 'అగ్రతలుపులు' పేరుతో వ్యాసాలను, కవిత్వాన్ని వెలువరించారు. ప్రాథమికంగా గమనిస్తే నీహారిణి కవిత్వంలో వస్తువు విస్తృతమైంది. అంత విస్తృతమైన దాంట్లోనూ ఒకింత అంతసూత్రతని గమనిస్తే అది జీవితం. ఆ జీవితాన్ని వివరించడంలో, విశ్లేషించడంలో ప్రేరేపించడంలో ఒక ప్రధాన పార్శ్వాన్ని వెదుక్కుంటే అది ఒక స్త్రీ గొంతుకే. మరో పార్శ్వంలో వర్తమాన తెలంగాణా ఉద్యమాన్ని సార్థకం చేయగలిగిన పార్శ్వం మరొకటి.

నీహారిణి స్త్రీవాదకవిత శాంతియుత ప్రేమపూర్వక జీవనాన్ని ఆపేక్షించేది. తిరస్కారం ధ్వనించినప్పుడు కూడా ఈ మార్గం కనిపిస్తుంది.

**"నిస్సిగ్గంగా ఉండే మానవత్వం అమ్మదనాన్ని నాన్న పిరికిదనాన్ని/ బంధులోకాన్ని వేటాడే సమాజాన్ని వెలివేయాలన్న చైతన్యపు నిర్ణయం"** (పే. 12)

**"పురుష ప్రపంచమే ఇక ఒంటరిదై పృథ్విపై తల్లులను -వెతుక్కునే రోజులాసన్నమైనవని/ తగ్గుతున్న ఆడనిష్పత్తి"** (పే. 12)

**"శరీరంపై పడే నిఘాకన్ను వెండితెరకిచ్చే నిర్లజ్జ దృశ్యాల స్మశానవాటికల్లో / ఇంట్లో చేరిన పేటికల్లోని/ కాష్టాన్ని ఎగేసే చేతుల్లో తనువంతా తచ్చాడు దృశ్యాలు"**

**"కుటుంబంలో సరిహద్దురేఖను చూస్తు సంయమనం పాటిస్తున్న రెండు దేశాలంటి/ రేపటి తరాల రాయ బారిగా ఉండే ఆమె/ వారాంత వాతణిజ్యాన్ని/ అపనమ్మ కాన్ని అభద్రతను ప్రతిఘటిస్తుంది"** (పే. 13)

ఈ వాక్యాల్లో వరుసగా మొదటి పైతృక సమాజపు స్వభావం దానిపై నిర్ణయం. రెండవ వాక్యంలో వర్తమానాన్ని, మూడవ వాక్యంలో వాణిజ్యభాగాన్ని, నాలుగవ భాగంలో సమాజానికి, కుటుంబానికి మూలమైన ధర్మతత్వ కేంద్రంగా తీర్చిదిద్దారు. ఇందులో అనేక కోణాల విభిన్నత దాగుంది. ఒక సాధారణ ఖండికలో చెప్పుకోదగిన అర్చేనిటినీ సాధించారు.

ఈ క్రమాన్ని ఇంకా విశ్లేషించుకుంటే సమాజంలోని వైవిధ్య ఆర్థిక, సామాజిక వర్గాల ఉనికి నుంచి స్త్రీ జీవితపు నమూనాలని దర్శించి ప్రదర్శించారు.

**"దేశ ఆర్థిక వ్యవస్థ గ్రాఫ్లైన్‌కు/ చుక్కలు పేర్చిన సగటు జీవిగా/ నువ్వు సీసాలు ఖాళీ చేస్తుంటే/ కన్నీటితో నింపుతుంది ఆమె"** (కల్తీలో జీవితం-29పే)

**"బరువైన పెళ్లి ఆల్బమ్ ముందు గడిపిన అరగంట సమయాల్లో/ మాడుతన్న కూరతాలూకు వాసనలు ఇల్లంతా అలుముకున్నట్లు / గుండెనిండా నిట్టూర్పులు నిండుకున్నయ్ ఆలోచనల్లా"** (ఇల్లాలి భాగోతం-పే. 35)

**"అనాదిగా ప్రపంచం/ ఆటబొమ్మగా చేసిందామెనే/ అంగట్లో సరుకుగా అవలీలగా దొరికేదేగా/ అరగంట ప్రకటనల్లో/ అంగాంగ ప్రదర్శనల్లో/ మనిషిగాకాదు వాడబడుతున్నది వస్తువుగా"** (విన్నప్పం-47)

చాలాసార్లు గొంతుకలో స్త్రీవాద పార్శ్వం స్పష్టంగా ఉన్నా జీవితంలోని సాఫల్యాలనే నీహారిణి ఆపేక్షిస్తారు. అనేక పంక్తులు జీవితం. అందులో స్త్రీ. ఆ పాత్ర చుట్టూ అల్లుకున్న పరిస్థితులు మొదలైనవాటిని విశ్లేషిస్తాయి. పై వాక్యాల్లో స్త్రీ కళ, ప్రభుత్వం నుంచి పరోక్షంగా పడుతున్న ఇబ్బందుల్ని స్పర్శించారు. దాడులు, కళపేరిట సినిమాలు, ప్రకటనలు చేస్తున్న వెర్రిపనులు. భార్యాభర్తల సహజీవనం, ఒంటరిగా కుటుంబ బాధ్యతలని మోస్తున్న స్త్రీ ఇలాంటి అనేక అంశాలు కనిపిస్తాయి. చాలా ప్రశ్నలు కుటుంబ జీవనంలోని ధర్మాన్ని గూర్చి, సమాజంమీద, దాన్ని అదుపులో పెట్టలేని రాజ్యం మీద సంధిస్తారు.

ఏ కవిత్వానికైన ఒక చారిత్రక చలనశీలత ఉంటుంది. దీన్ని అర్థం చేసుకోకుండా దాని అంశాన్ని అర్థం చేసు కోలేం.

'It is impossible to understand modern poetry'
' unless under stand it historical motion". అంటాడు క్రిష్టఫర్ కాల్వెల్. బహుశః ఈ దశాబ్ది సృజనలో స్వీయ అస్తిత్వం స్వీయ సమాజాస్తిత్వమనే రెండు పార్శ్వాలు కనిపిస్తాయి. ఒకటి సమాజంలో వర్గ, కుల, జెండర్ వైరుధ్యాల నుంచి తనను తెలుసుకునేదయితే రెండవది తన ప్రాంతం, సమాజాన్ని గురించి తర్కించేది.

బహుశః ఈ మలి ఉద్యమ సందర్భంలో తెలగాణా గురించి రాయని కవి లేడు. సమాజంలోని అన్ని పార్శ్వాల కవిత్వం పరాయీకరణని, పరాధీనతని, దానికి కారణమైన అంతశ్శత్రువులని వారి స్వభావాన్ని అర్థం చేసుకుంటుంది. నీహారిణిలోనూ ఈ ముద్ర ఉంది. తెలంగాణాకు సంబంధించి రెండు, మూడు కవితలున్నాయి.

**"కాళ్ళేళ్ళ పడైనా తెలంగాణా సాధించిన వాళ్లు/ శల్య సారథులుగాక రథసారథులెట్లౌతరు? యుద్ధమందుకే అనివార్యమిప్పుడు"** (గోముఖ వ్యాఘ్రాలు-106)

**"బొడ్రాయికాడ కూసున్న పెద్దొడు/ ఓటుముద్ర పవరేందో/ మొన్న గొట్టిన దెబ్బేందో/ దాని పవరేందో తోటోండ్లకు చెబుతాండు"** (ఖేల్‌ఖతమ్-49 పే.)

వీటితోపాటు ప్రపంచీకరణకు వ్యతిరేకంగా రాసిన కవితలు నాలుగవసరం, పచ్చి నిజాలు వంటివి ప్రపంచీకరణలో మానవ సంబంధాలపై దృష్టి సారించాయి.

నీహారిణి ఉపయోగించే భాష కూడా ఒకింత ప్రౌఢగుణం కలిగింది. కొన్నిసార్లు గ్రాంధికవాక్యంలా ప్రవర్తిస్తుంది. 'ని' అనే ఉపసర్గని వాడిన సందర్భాలనేకంగా కనిపిస్తాయి.

'నిగూఢం-11, నిస్సిగ్గక-12, నిర్ద్వందం-28, నిర్వీర్యం-42, నిస్తేజం-42, నిస్త్రింశ, నిస్వనం-48, నిర్నిద్రాగానం-57, నిరలంకారం-63, నిశ్చలనం -127, ఇలా అనేక పదాలు కనిపిస్తాయి. తనదైన గొంతుకతో నీహారిణి సుస్పష్టమైన మార్గంతో మరో సంపుటితో ముందుకు రావాలని ఆశిద్దాం.

ప్రతులకు: పాలపిట్ట బుక్స్
16-11-2016/1/1
403, విజయసాయి రెసిడెన్సీ,
సలీంనగర్, మలక్‌పేట,
హైదరాబాద్-36.



- ఎం. నారాయణశర్మ
91772 60385

## సాయం సంధ్య

కూచుని, పడుకుని,
చూస్తూ చూస్తూ నిద్రలోకి జారుకునీ
అలసిపోయిన క్షణాలు
ఏటవాలుగా నేలబారుకు దిగుతున్నప్పుడు
ఎక్కడినుండో పరుగు పరుగున వస్తాయి
మరుగున పడ్డ సజీవ ఘడియలు కొన్ని.
పచ్చపచ్చని పరిమళాలు చుట్టూ మూగి
ఉక్కిరి బిక్కిరి చేస్తూనే ఉంటాయి.

మసకవెలుతురులో
ఉండీ ఉండీ ఎవరో కొమ్మలు ఊపినట్టు
జలజల మని రాలే పున్నాగల వాన
మెత్తమెత్తగా ఎర్రెర్రని పెదవులతో
పాదాలు ముద్దాడే పారిజాతాలు
ఎందుకు మళ్ళీ మరోసారి
కళ్ళముందు ఈ పచార్లు?
ఒక్కసారి కరచాలనం కోసం అన్నట్టు

నేలకు వాలుతున్న
తేలిక పాటి మబ్బులు
పెరట్లో నాటుకున్న కలలు
ఎక్కడ భద్రంగా కాలాన్ని కప్పుకు దాక్కున్నాయో కాని
ఈదురు గాలి మధ్య రెపరెపలాడే శాలువా కొసల్లో
చిటికెన వేలట్టుకు ఊగే
అల్లరిపిల్లలవుతాయి.

పుల్లపుల్లగా రోజంతా చప్పరించే చిట్టి ఉసిరి
మరోసారి నాలుక కొసల్లో మెరుస్తుంది.
ఉదయాన్నే మేల్కొలుపుల తీయతేనియ
కోయిల కుహూకుహూలు
కోటి అనుభూతులు కుమ్మరిస్తాయి.
చల్లచల్లని కళ్ళాపి జల్లి ఇష్టం వచ్చిన ముగ్గులు
గీసుకున్న వీధి వాకిలి

అభిసారికలా చిక్కి శల్యమై
కారు చక్రాల కింద ఒదిగి ఉంటుంది.

ఇప్పుడు
గతమూ వర్తమానమూ కలిసి
నిమిషాల బండి లాగుతూ ఉంటాయి.
బ్రతుకు లోయపొడుగునా పూసిన
రంగురంగుల గోరింట పూలు
నిమిషానికో కథలు చాయ కథలుగా అల్లుతాయి.
సాయంత్రానికి సంసిద్ధమవుతూ
చంద్రకాంత పూలు
గుప్పిళ్ళ మధ్య ఎన్ని తరాలను దాచుకు వస్తాయో
బీరీజు వేసుకునే కలల మధ్య
ఎంత కమ్మని సాయం సంధ్య.



-స్వాతీ శ్రీపాద
8297248988

## వర్ణాలు ఎన్నో??

వర్ణం ఇపుడో జవాబు దొరకని ప్రశ్న...

అగ్రరాజ్యాల జాత్యహంకారానికి
ఆది నుండి బలి అవుతూనే ఉంది...

కళ్ళకు కప్పిన పొరల ముందు
నలుపు వర్ణమక్కడ
ఎంత వికారమై పోయిందో...

నల్లిలాగా నలుపుతున్న
కాలి బూటులే చెబుతున్నాయి...

వర్ణం వివర్ణమై పోతూ
వేదనతో ఆగిపోతున్న ఊపిరిగామిగిలిందక్కడ...

ఎంత తప్పు....ఎంత తప్పు...
మరి కాస్త ఇటుకూడా చూద్దామా...

వర్ణం వేద కాలం నుండి విశృంఖలంగా
తమ అభిజాత్యాన్ని కొనసాగిస్తూనే ఉంది...
మన కర్మ భూమిలో...

అగ్ర వర్ణం శూద్ర వర్ణాన్ని
శూద్ర వర్ణం అధమ వర్ణాలని
అణగద్రొక్కుతూనే ఉన్నాయి...

ఇప్పటికీ పరువుహత్యల పేరుతో
పేగుబంధాలకు వేస్తున్న ఉరి
సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేస్తూనే ఉన్నాయి...
వర్ణమంటే రంగు కాదిక్కడ కులము

కులాల మధ్య మతాల మధ్య
కనిపిస్తున్న స్నేహభావం వెనుక
కంటికి కనిపించని కుమ్ములాటలెన్నో
అవి జ్వాలలై ఎగసినప్పుడు మాత్రం
లోకం ఉలిక్కిపడి చూస్తుంటుంది...

వర్ణమెపుడూ ప్రత్యేకమే...
అగ్రరాజ్యాలలో రంగుగా
భరతదేశంలో కులము , మతముగా..

ఎందుకంటే
అవి రెండు నానార్థాలు గనుక...!!



-శాంతి కృష్ణ
9502236670

## బెంగ

బడిగంటబాలలకు ఒకమాటన్నా చెప్పి రాకపోతిని,
దాని గుండెకు ఠంగు.. ఠంగు..
ఓదార్పులేక ఎంత కుమిలిపోతున్నదో ?
ప్రార్థనపసిగొంతును అట్లనే విడిచి వస్తిని,
అది ఎన్ని కలవరింతల గీతాలనల్లుకుంటున్నదో..

సంతకం చిన్నారికైనా మాటయిచ్చి కదలకపోతిని,
రెండుపూటల ముద్దులకై ఎంత ఎదురుచూస్తున్నదో..?
చాకుపీసుపాపనైనా జోకొట్టి రాకపోతిని,
డబ్బా ఊయల్లో ఎంతటీ తెల్లనిఅల్లరిని చేస్తున్నదో..?
నల్లబల్ల పిల్లమనసుకు
నడుస్తున్న అనకపోతిని,
ఇంకెంత నల్లని అలుకపూనుతున్నదో?
పుస్తకాలబిడ్డలకు
వస్తానని తెల్పకపోతిని

ఎన్ని రెపరెపలబెంగలై
నిట్టూరుస్తున్నాయో?

నా రెండో ఇల్లు ,బడికి
తాత్కాలిక వీడ్కోలైన పలికి రాకపోతిని,
గేటు హృదయాన్ని తెరుచుకొని
ఎన్ని ఏడ్పులో
ఎన్ని ఎదురుచూపులో..?
ఈ కఠిననిరీక్షణ పరీక్షలో పాస్ మార్కులతోనైనా
నన్ను గెలిపించు ప్రభూ!
నా బడి వైపు నడిపించు దేవా!



- డా.కాసర్లనరేశ్ రావు
9441406252

## కరోనా శతకము

అదరక ఆపదలందున
బెదరక పెనువ్యాధులనిక పీచమడంచన్
కదలెను స్వచ్ఛంద సేవ
కదళము రణమిపుడె చేయకడగి కరోనా !

క్రిమి కీటకముల వెన్నియొ
గుమికూడినగాని హాని కూడునె ? పుడమిన్
విమలమ్మగు సృష్టినిటుల
కుమతిని పూనితివె కూల్చ కుటిల కరోనా !

రమ్మని పిలిచితిమా నిను ?
ఇమ్మహికే చేరినావు ఏ క్షణమునవో
గమ్మున నుండక, దుర్మా
ర్గమ్ముగ వర్తిల్లుచుంటె గడుసు కరోనా !

గృహముననె నుంటిమిప్పుడు
ఇహపరముల జూచుకొనుచు ఈప్సితముగ – నీ
అహమేమి చేయగలదిక
సహియింపము మూటముల్లె సర్దు కరోనా !

వైద్యులు నిరతము శ్రమతో
ఆద్యము నీ కెటను కలదొ, అనుశీల కళా
వేద్యులగు చుండిరి కనిది
చోద్యమె నీ గుట్టురట్టు చోర కరోనా !

వచ్చుటయు మంచిదైనది
ముచ్చటగా ఇంటి శుభ్రమును నెరిగితిమే
చిచ్చరపిడుగులు తిరుగుట
విచ్చలవిడిగాను లేదు, వింత కరోనా !

అహరహమున సేవకులే
అహమును మదినెంచబోక అర్పితహృదితో
ఇహమే పరముగ దలచిరి
గృహముల విడి, వారె ధన్యులెన్న కరోనా !

కనిపించని గరళమగుచు
వినిపించని చావుడప్పు వేసెదవే, ఈ
జనతపయి కరుణలేదో
ఘనపాషాణంపు హృదయ ఖరమ, కరోనా !

ఎది అయినను అతి చేయుట
మొదటికె మోసమ్ము అగును మూర్ఖతకాదే
అదె పనిగా సెలవులగుట
నిదురకు బానిసలు కారె నీచ కరోనా !

వంటను నేర్చిరి పురుషులు
మంటలు ఆ పైన, లోన మండుచునుండన్
ఒంటిగ నలభీములైరి
కంటనె తడిపెట్టుకొనిరి కనవె కరోనా !



-చిమ్మపూడి శ్రీరామమూర్తి
సెల్: 9704177270

## అపర చాణిక్యుడు మన పి.వి

తెలంగాణ కన్న బిడ్డ
భారతమాత ముద్దుబిడ్డ
వరంగల్లు జిల్లా వాస్తవ్యుడు

తెలుగు ప్రజలకు ఖ్యాతిని
ఖండాంతరాలకు తెలిసేలా చేసిన
మహనీయుడు పాములపర్తి
వెంకట నరసింహారావు

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా
ఎగిసిపడిన ఉద్యమ కెరటం

రాజకీయ ఉద్దండులు బహుభాషా కోవిదుడు
సకల విద్యా సంపన్నుడు

పద్దెనిమిది భాషల్లో నిష్ణాతులై
విద్యా రంగంలో
విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనుడు

భారతదేశ ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి కష్టకాలంలో
ఉన్న భారత దేశాన్ని
ప్రగతి వైపు పరుగులు పెట్టించిన ఆద్యుడు

మైనార్టీ భారత ప్రభుత్వాన్ని నిలబెట్టిన వ్యూహకర్త

సమర్థవంతం ప్రధానిగా బహుముఖప్రజ్ఞాశాలి
తెలంగాణ సత్తాని జాతి గౌరవాన్ని చాటిచెప్పిన
తెలంగాణ తేజోమూర్తి
భారతదేశ చరిత్రలో చిరస్మరణీయులు.
(భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు
శత జయంతి ఉత్సవాల సందర్భంగా)



-పోతుగంటి వీరాచారి
9666693494

## పీ.వీ మొగ్గలు



పాములపర్తి తేజోమూర్తిగా ప్రస్థానం సాగిస్తూ
తెలంగాణ ఆత్మగౌరవాన్ని విశ్వవేదికపై చాటాడు
దక్షిణభారత తొలిప్రధానిగా ప్రఖ్యాతిగాంచిన పీవీ

మైనారిటీ ప్రభుత్వానికి గగనమై నేతృత్వం వహిస్తూ
వ్యూహాత్మకంగా ఆటుపోట్లను అధికమించిన ఘనుడు
రాజనీతి చాకచక్యానికి నిదర్శనమైన ధీశాలి పీవీ

భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులతో
సంస్కరణలకు బీజంవేసి దేశాన్ని గాడిన పెట్టాడు
దేశగౌరవాన్ని కాపాడిన అపరచాణక్యుడు పీవీ

భాషలకే భాషనేర్పిన జ్ఞానవారధిగా కీర్తి పొందుతూ
సాహితీప్రవంతిలో పేరెన్నికగన్న రచనలు చేసిన దిట్ట
బాహుభాష కోవిదుడైన విజ్ఞాన దురంధరుడు పీవీ

భారతజాతిని కాపాడిన తెలంగాణ సూర్యుడై
చలువవెన్నెల కురిపించిన వెలుగుల వజ్రసూచి
భారతదేశ ప్రజల హృదయాల్లో చెరగని రేవీ పీవీ



-కొలిపాక శ్రీనివాస్
9866514972

## నమస్కారం

దేశమంటే మట్టి కాదోయ్
అని ఒక మహాకవి అంటే
ధరణిపైన మనిషిని గుర్తించాం
నా దేశం రసవద్గంగ
అని మహాకవి అంటే
జనస్పర్శతో పాటు జలస్పర్శను గుర్తించాం.
పుడమి నాలుగు చెఱగులా
ఈ దేశం నాగరికతను పంచిందంటే
భారతదేశం సంస్కారగంగ
ఆ సంస్కార ప్రకటనకు ఒక ప్రతీక
నమస్కారం.
పలకరింపు అంటే కరచాలనం కాదని
ప్రపంచానికి పాఠం చెప్పిన దేశం
వెలుగులు తెచ్చే సూర్యుడికి
వెన్నెల పంచే చంద్రుడికి
ప్రవహించే నదికి
పయనించే గాలికి
కదిలే ప్రతి జీవికి
గొడుగల్లే నిలిచిన ఆ నింగికీ
అడుగడుగున కాపాడే నేలకీ
నమస్కరించే సంస్కృతిని
ఈ దేశం నేర్పింది.
మనలోని ఆత్మ పరమాత్మ అంశ అనీ
అది ఎదుటి మనిషిలోనూ కొలువుతీరిందని
మనిషిలో మాధవుణ్ణి దర్శించే సంస్కృతి
పవిత్ర భారతదేశం నేర్పిందే
అందుకే దేశానికి నమస్కారం.
మనకి జన్మనిచ్చిన అమ్మంటే
జగతికి జన్మనిచ్చిన పరమాత్మ లాంటిదే
అందుకే మాతృదేవోభవా అంటూ
ఆమెకు నమస్కారం.
నూరేళ్ళ జీవితాన్ని కానుకగా ఇచ్చిన తండ్రికి
పితృదేవోభవా! అంటు నమస్కారం.
తెలివికి పదునుపెట్టి
తెలుసుకునే గుణాన్నిచ్చిన గురువుకి
ఆచార్యదేవోభవ! అంటూ నమస్కారం.
మానవాళి అంటే మన వంశావలి కనుక
ఇంటికొచ్చే ఆత్మబంధువులకు
అతిథిదేవోభవా! అంటూ నమస్కారం.
నమస్కారం ఒక హృదయ భాష
ఆ సంస్కృతి నేను నేర్చుకున్న అక్షరమాల
తండ్రి కన్నా పైన తల్లి
ఆ తల్లి కన్నా పైన దైవం
అంటూ ఆరోహణ క్రమం తెలిపిన
జ్ఞాన కలశం గురువు.
పున్నమినాటి చంద్రబింబం గురువు
ఇంతటి వివేకానికి మూలాధారం గురువు
పుణ్యభూమి భారతానికి పరువు, గురువు
ఉనికి వున్నంత కాలం
ఊపిరి సాగినంతకాలం
గురువర్యునికి
త్రికరణాల నమస్కారం.
(గురు పౌర్ణమి సందర్భంగా)



- మద్దాళి రఘురాం
9866057777

# బతుకును శుభ్రపరిచే "అంతర్మథనం"

పుస్తక సమీక్ష






సంస్కృతంలో భర్తృహరి "సుభాషిత త్రిశతి" దగ్గరనుంచీ మానవజీవిత వికాసానికి "శతకాలు" ఇతోధికంగా తోడ్పడ్డాయి. తెలుగులోనూ శతకాలు "వృషాదిపశతకం" తో మొదలై "భక్తిమార్గాన్ని" వికసితం చేశాయి. అనేక భక్తి శతకాలతో పాటు వేమనశతకం, సుమతీశతకం,కుమారీ శతకం, కుమారీశతకం వంటి నీతిశతకాలు మానవ ప్రవర్తనను చక్కగా ప్రభావితం చేశాయి. అయితే శతకాల్లో అనేకరకాలు వున్నా జనం భక్తిశతకాల తరువాత నీతిశతకాలకే పెద్దపీట వేశాయి. శతకాల గురించి ఓ కవి ఇలా అన్నాడు. "శతకాలు చదివి చూడు/ఇంకెప్పుడు పడదు/చెత్తలో నీ కాలు" అంటూ శబ్దరమ్యంగా చెప్పాడు. ఇపుడు మాట్లాడుకునే "అంతర్మథనం" శతకమే కానీ శతకాల నియమాలను అచ్చుగుద్దినది కాదు. కాస్త ఆధునిక నియమంగా చంధోనియతిని, మకుటనియమాన్ని, పరిహరించీ, నాలుగు పాదాలుగా ముక్తకాలుగా, నీతిపరిమళాలుగా వ్యక్తం కాబడిన శతకం. వాటిలోని వచనశతక విషయాల్ని పరిశీలిద్దాం!

కవయిత్రి శేర్ భారతీమూర్తి నిండైన అక్షరపరిమళం. వారిలో సామాజిక స్పృహ, ఆత్మశోధన మెండు. 108 శతక పద్యగంధికలు చదివితే, హృదయక్షాళనం కాగలదు. కొత్త జీవితపుటడుగులకు ఉదయమూ జరుగుతుంది. తొలిపద్యంలో మానవసంబంధాల్లోని కపటత్వాన్ని ఎత్తిచూపారు.

"కలిమి కలిగిన నాడు కనిపించు బంధువులు/కష్ట కాలమందు కానరారు/కలిమిలేములందు కలిసినడిచేవారు/ నిజమైన బంధువులు ధరణిలోన''. ఇందులో "బెల్లమున్నప్పుడే ఈగలొస్తాయి" అన్న సామెతవుంది. చెరువు నిండినపుడు కప్పలు పదియారువేలు చేరు" అన్న పాతపద్య వాసనా వున్నా కలిమి లేములు అనగా కష్టసుఖాలందు సరిసమంగా తోడు నిలుచువారే బంధువులు అని అన్నారు. ఇంకో పద్యంలో మరో మంచి విషయాన్ని చెప్పారు.

"సౌఖ్యంబు నివ్వని సంపదలు ఏల?/సంతోషమే లేని సంసారమది యేల/సంపదల తరిగినా మరల పొందగ వచ్చు/సంసారమే చెడిన చెరుపింత కాదయా". విలువైన పద్యం. నిజమైన సంపద సంతోషమని అంతర్గత సత్యాన్ని చెప్పారు. అశాశ్వత సంపదలవెంట మనిషి పరుగుతీయడాన్ని ఆక్షేపించారు కూడా!

లోకంలో వర్ణవివక్ష (రంగు) వుంది. అమెరికా లాంటి దేశాల్లో అదొక సామాజిక వివక్ష. ఇటీవల జార్జిఫ్లాయిడ్ వుదంతంలో తెల్లతోలు అహంకారం,అరాచకం ప్రపంచమంతా నిరసించింది. ఈ కవయిత్రి నలుపు రుచిని,ఔన్నతిని చాటారు కిందిపద్యంలో చదవండి.

"నల్లగా వుందని తెల్లగా లేదని/అందమంటే తెలుపే అనుకోకు/నల్లబెల్లానికే తీపెక్కువన్నట్టు/పోతపోసిన రూపురేఖలుండంగా". నల్లబెల్లానికే తీపెక్కువ అనడం చక్కని పోలిక. పురాణాల కాలం నుంచీ ఐతిహాసికాలనుంచీ దానగుణ ప్రశంసను కొనియాడారు. ఈమె దానగుణం లోని అసార్థకతను ఎత్తిపొడిచారు.

"దానమిచ్చానన్న దర్పముతో నీవు/ప్రతిఫలము కోరుట పాడియగునే/ఫలము నాశించని పరమాత్మరూపమే/ దానమన్నది నిజము ధరణిలోన''. దానాన్ని పరమాత్మరూపంతో పోల్చడం ఈ పద్యంలోని విశేషం. ఇలాంటివే అనేకమైన పోలికలు నవ్యతనూ,సవ్యతనూ కలిగివున్నాయి. పుస్తకాన్ని కలియతిరిగి ఏరుకుందాం కొన్ని ముత్యాలను!

1."అభిమానధనము అడుగుకొన్న రాదు/పూవుకు తావివలె పుట్టుకతోనెవచ్చు".

2."కరుణి జూపని వాడు దేవుడైనా సరే/కఠినరాయి కన్న మిన్న గాదు/కరుణించి కాపాడు పామరుండైనా/దేవుడంటు ఇలలోన వాసికెక్కు".

3.''ధనహీనులైనంత దారిద్ర్యవే వచ్చు/మానహీనులైన మనుగడకే ముప్పు".

4."నమ్మకము అన్నది నడిపించునావ/కల్ల అన్నది నావకు చిల్లుయే గాదా"

5."అహంభావియైన గొప్ప పండితుని కన్న/లోకజ్ఞానియైన కవివర్యుడే మేలు"

6."తల్లి మనసుకు లేవు వర్ణభేదాలు/అది చూసే ఆడది అసలు తల్లేగాదు"

ఈ వచనశతకం నిండా ప్రవాహగతిలో ఎన్నో ప్రబోధాలున్నాయి.జీవిత పరమార్థాన్ని తేలికపాటి మాటలతో అరటిపండు వొలిచిపెట్టిన చందంగా రచించారు. కొన్ని పద్యాలలో వేమన,సుమతీశతకాల ప్రభావప్రసరణ వున్నా, కవయిత్రి కొన్ని కొత్తపోలికల్ని జోడించి తనముద్ర వేసుకున్నారు. బతుకు శుభ్రపరిచే అనేకానేక అంతర్మథనాలూ వున్నాయి. వచనపద్యాలు అయిన వాడినభాష,నడకను బట్టి చాలావరకు "ఆటవెలది" ఛాయలున్నాయి. ఏది ఏమైనా మనం నిత్యజీవితంలో మాట్లాడుకునే భాషలో నిత్యసత్యాలెన్నో కొత్తచూపుతో పట్టుకొచ్చారు. వారి వచనశతకం ప్రక్రియా నూత్నతకు మనసారా అభినందనలు.

ప్రతులకు..
శేర్ భారతిమూర్తి, ప్లాట్ నెం..205,
మాతూరు అపార్ట్మెంట్ ,
ఇంటినెంబరు..10?2?10
ఇన్కమ్ టాక్స్ టవర్స్ రోడ్ ,
హైదరాబాదు..500004
9949777657.



-మెట్టా నాగేశ్వరరావు
సెల్: 9951085760



## ఇదో గతంలా

చుట్టూరా ఆవరించిన చీకటిని నిందిస్తూ
ఎంతకాలం కూర్చుంటారు.

ప్రయత్నించి చిన్న దీపాన్నైనా
వెలిగించ లేరా...!
మీ నిశ్శబ్దంలో మీరు ఉండకుండా
మెరుస్తున్న నెత్తుటి కాంతితో
ఎందుకు నిద్ర లేవరు...!
కనిపించనిది మన దేహాలపై
చేతులిరుస్తున్నప్పుడు
తడారిన గొంతు కలతో కాకుండా
నిండు వెలుగుతో
నియంత్రించిన విధానాల్ని
ఎందుకు పాటించరు...!
ఏ తుఫానుకో ఇన్నివేల చెట్లు రాలిపోయాక
అంతా చిందరవందర అయిపోయాక
ఎటు చూసినా చనిపోయిన సమయాలే...!
కాలం మన ముందే
ఇలా ఉరిపోసుకుంటుంది అనుకోలేదు.
ఏ క్షణాలు ఎవరి కన్నీటి చెమ్మని
పలకరిస్తాయో తెలియదు.
దగ్గరగా వచ్చి ఎవరికీ ఏ సహాయం చేయలేం.
కళ్ళుండీ దృశ్యాన్ని నిరాకరించడమే
మనం చేస్తున్న పని
రేపు ఎవడో ఒకడు
ఇదంతా రికార్డు చేసి తీరుతాడు
వాళ్లంతా ఇదో గతంగా
లేదూ చరిత్రగా
అనుభవాలు పండిన ఆకులతో లిఖిస్తారు.



-ఏటూరి నాగేంద్రరావు
7416665323.

## వలస కార్మికుల గోస

పుట్టినూరు కానరాక
కంటిలోన నీరాగకా
కన్నవాళ్లు గుర్తుకొచ్చి
గుండెలోన దుఃఖ మాగకా
నింగికేసి చూస్తున్నము
దేవుడ అని అరుస్తున్నము.

పసిగుడ్డులు మా పిల్లలను
గుండెల్లో దాచుకుంటు
పేగులన్ని ఎండిపోతే
నీళ్ల తోని తడుపుకుంటు
కొన ఊపిరి పానాలను
బిగబట్టి నడుస్తున్నము
మేమేవరం .

నడిచి నడిచి పాదాలన్నీ
పగిలిపోయి రక్తాలొస్తే
బట్టతోని కట్టుకుంటూ
ఊరిబాట పట్టినోల్లం

కన్నీటికి బదులు లేదు
ఓదార్చే వారులేరు
దిక్కులేని నడకలు మావి
ఏ దిక్కులేని వాళ్ళం
మేమేవరం .

ఎన్నెన్నో బంధాలు అవలీలగా
చేదిరిపాయే కాలే కడుపుతో
నడకా శవాలను మిగిలిచ్చే.

ఎందుకింత శిక్ష మాకూ
రక్షించే నాథుడేడి
ఏ దిక్కును చూడాలి
అన్ని దిక్కులా దీనం
పసిగు డ్డులు చంకలోన
నడుచుకుంటూ వృద్ధులంతా
రక్తమోడు పాదాలు
మా బాధలు ఎవరికి చెప్పాలి.
చిన్న చిన్న బతుకులు మావి
చిటిలి పోయే ఈ రోజు
కష్టపడే రెక్కలు మావి
విరిగిపోయే ఈ రోజు.

పానాలను నిలిపేందుకు
బతుకు బాట పట్టినోల్లం
చాకిరీ చేతులతో
కన్నీళ్లను తుడుచుకుంటు
శాపాలై మిగిలినోల్లం
బతుకు ప్రశ్నలయ్యినోల్లం
మేమేవరం.

ఏ దేవుడు కరుణించలే
ఏ ప్రభుతా రక్షించలే
చేసిన సేవలు కంట్లో
కన్నీరై పారుతుంటే
రక్త మడుగులో పాదం
ఆగకుండ సాగబట్టే
మేమేవరం.

ఓటు లేని వాళ్ళమైతే
పానాలకు విలువ లేదా
ఎన్నికలు వచ్చినప్పుడే
వంగి వంగి దండా లా
చచ్చిందా మానవత్వం
పనిచేయద అధికారం
లెనోళ్ళకే శాపాలా
ఉన్నోళ్లకే పీఠాలా.

గాయపడిన మనుసు మాది
అడుగుతుంది నింగిని చూసి
ఈ స్వతంత్ర భారతంలో
మా కష్టం కానరాద
మా బతుకు బతుకు కాదా
మా ప్రశ్నకు బదులు లేదా
మనుషులుగా లేమ మేము
ఐతే ఇంకెవరిమి మేము
రక్షించే నాథుడు లేడా.

కనులు మూసుకున్న దేవా
కనులు తెరిచి చూడలేవ
నువ్వైనా చెప్పరాదా
మేమేవరం మేమేవరం మేమేవరం
మేమేవరం మేమేవరం మేమేవరం.



-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
98490621038



ప్రపంచమే కరోనా రోగిలా మారి
నేడు క్వారంటైన్ లో బందీగా ఉంది

కడుపు మండిన పేగులన్నీ
ఆర్తనాదీన రేవుల్ని దాటుకుంటూ
ఆకలితీరం ఆవలివైపుకు చేరుకోడానికి
కరోనా గీసిన కత్తుల వంతెన మీద
నెత్తుటి యాత్రను చేస్తున్నాయి

దేశం అట్టడుగు పొరల్లో
కనాకష్టంగా కదలబారుతున్న కళేబరాలు
కాలంతో నిరంతరం కలబడుతూనే ఉన్నాయి..

ఎంత తవ్వినా తరగని చీకట్లు
దారిపొడుగునా నిరాశా వనాలను
మండిస్తూనే ఉన్నాయి

కడుపులో మిగిలిన
ఆ ఒక్క ఆఖరిముద్దక్కూడా
ఆయుష్షు తీరిపోయినట్టుంది
ఎంత నడిచినా తరగని దూరం
కాళ్ల కింద కాలసర్పంలా
భారంగా కదులుతుంది..

ఆదిమత్వానికీ, ఆధునిక తత్వానికీ మధ్య
కరోనా విసిరిన
లాక్ డౌన్ తొవ్వల వెంట
వెలుగుల కోసం సాగుతున్న
జీవనయాత్ర మసకమసగ్గా సాగుతూనే ఉంది...

భూతల స్వర్గం..
భూతాల స్వర్గంగా మారిపోతుందేమోనని

## లోకమంతా ఆర్తనాదం

ఇరుసులిరిగిన బతుకు బండి
వీధి చివరన సందులో నక్కి
ఎల్లలు లేని శూన్యంలోకి
బెదురు చూపులు చూస్తుంది

మట్టికీ, మనిషికీ మధ్య పేగు బంధమేదో
పలుచబడుతున్న వేళ
ఒక్కడే
వేలవేల ముక్కలుగా బద్దలవుతున్న నిర్లిప్త శోకం
ఇప్పుడు ప్రపంచం పాడుకునే
ప్రభాతగీతమయ్యింది

మనిషికీ, మనసుకీ మధ్య
ఆప్యాయతలు మొలిపించిన
కరచాలనమే నేడు కాలనాగై
లోకం నిట్టాడి మీద నిలబడి
బుసలు కొడుతుంది

ఇప్పుడు దేశమంతా
చచ్చిన శానిటైజర్ల కంపు
లోకమంతా
శోకసంద్రంలో బందీ అయిన
ఐసోలేషన్ వార్డు

ఆశరాలిన కాలంలో
బతుకులన్నీ ఎండిన చితివాగులై
చిగురు శ్వాసల చినుకులు కోసం
చకొరాల్లా ఎదురు చూస్తున్నాయి

ఎండిన వాగులే
నిండుకుండలయ్యే రోజులొస్తాయి
మైడియర్ మహమ్మారి కరోనా
ప్రాణాలను కబళించే కసాయిదానా..

నీ కాలమిక ఎల్లకాలం సాగదు
వ్యాక్సిన్ ఒడిలో నీవు
శాశ్వతంగా సేదతీరే రోజులొస్తున్నాయి
ఇక రోజులు లెక్కపెట్టుకో కరోనా...

మళ్ళీ ఈ లోకంలో విరబూసే జీవన వనాల్లో పుట్టుకొచ్చే
ఆత్మీయ ఆలింగనాలు
ప్రేమైక చుంబనాల సాక్షిగా
నీకు సమాధులు మొలుస్తాయి

సిద్ధంకా కరోనా...
నీ మరణమిక తథ్యం.

– శ్రీకారెం
సెల్ : 94919 91918

## రెక్కలు తెగిన పక్షులు!

నిముషాలు...గంటలు...
రోజులు కాదు...ఏకంగా...
నెలల తరబడే...
కడుపునిండా తిండికి...
కంటినిండా కునుకుకి....
విశ్రాంతికి....మనఃశ్శాంతికి!
దూరమై...చెట్టో పుట్టకు చెదిరి
పోయిన చీమలు గుంపుపై...
కనిపించని ముంపు పడినట్లు
కరోనా కారణ కంప అమాంతం
వలస కూలీలపైనే పడి
ఇష్టానుసారంగా రక్కి...
రాచి రంపాన పెడుతుంది!
ఆకస్మిక జనతా కర్ఫ్యూ...
అనుకోని లాక్డౌన్....!
ఆ గాలిపటాల దారాలు అప్పుడే...
తెగి చెల్లాచెదురై పోయాయి!
నింగిని తాకలేక....
నేలపై బ్రతకలేక....
త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడే...
వలస పక్షులు రెక్కలు తెగి
నేలపై నడకను ఆరంభించాయి!
ఎక్కడలేని ఆంక్షలు... పక్షి
పెదరెక్కలు విరిచి
పంజరంలోకి తోసేసినట్లు!
నడుస్తున్న కాలికి సంకెళ్లువేసే
క్వారంటైన్లు...ఒకవిధంగా...జైల్లే!
చెయ్యని నేరానికి సామాజికఖైదీలు!
నేల తప్ప మరో ఆధారంలేక...
నడిచి...నడిచి...వందలు మైళ్ళు!
దారి దయార్ద్ర హృదయమైనా....
దూరం కనికరించదాయే...!
కరోనా చంపలేక పోయింది! కానీ
కరువు చంపి పారేసింది!
వలస 'పులస' కాదు పరుషమని
చితికిన బ్రతుకును చంకనెత్తుకొని
బరువెక్కిన హృదయంతో...
ఎంత ప్రయత్నించినా....!
సొంతగూటికి చేరలేక...వలస దారికి
మరలలేక మరయంత్రాలు...
రహదారిపై బారులు తీరుతున్నాయి!
మజిలీలు మనోవేదనకు...
ఊరటనుకాదు...ఆందోళననే పెంచితే...
వాళ్ళు కోట్లాది ఏళ్లుగా నడుస్తున్న...
రాతి యుగం మనుషుల్లాగే...
కనిపించి కన్నీరు తెప్పిస్తున్నారు!
(అరవై ఐదు మైళ్ళు నడిచిన (వలస కూలీ)
ఒక నిండుగర్భిణీదారిలోనే ప్రసవించిన...
గంటమాత్రమే విశ్రాంతితీసుకొని తుది
గమ్యం వైపు
మరోవందమైళ్ళు దాటినడిచిందన్న
వార్త చూసి...బరువెక్కిన హృదయంతో
ఆమెకు అక్షర అంజలిఘటిస్తూ.......)



-ఎం.వి.స్వామి
9441571505



## మోర్దోపు రోగం

దిక్కువాండ్ల రోగం
కండ్లపడని తుపాకితో
పచ్చిగుండ్లతో యుద్ధం
దునియ మొత్తం పీనుగుల కొట్టం...

కాలు అవుతల వెడుదమంటే
కట్టుకున్నదాని నొసటి బొట్టు
కడుపులవుట్టినోల్ల కండ్లనీళ్లు యాదికచ్చినై
వద్దన్నా యినకుండా
వాలాంచి గుంపుల దిరిగితే
సావుకు బయానా వెట్టినట్లే...

ఎగిలివారంగ లేసెటోల్లు
పొద్దు నెత్తిమీదికచ్చినా
పక్కల్నే పొర్లవట్టి
అంబటాల్ల
అరుగుమీద ముచ్చట్లన్నీ బందువడ్డయి
కలెదిరిగిన కాళ్ళు కట్టెలుగావట్టె...

ఏరోజు ఏవారమో
ఎరుకలేని రోజులచ్చె
అన్నిండ్లలో అయితారపు ఆటలే
కూర దెచ్చుకుందమంటే
పచ్చికూరే కారమై
కండ్లల్ల నీళ్లు రావట్టె
గమ్మతుగ ఎగిరిదుంకే పోరగాండ్లు
గంపకింద కోడిపిల్లలైరి...

ఒక పక్క
ప్రకృతి పచ్చవడి
మనల్ని చూసి నవ్వవట్టె
మొగులుమీద
మసివట్టిన మబ్బులు మాయమై
సంటిపిల్లల నవ్వోలె
తెల్ల మబ్బులు రావట్టె...

ఇది మంచికా చెడుగా
సమజువట్టని దినాలు

ఇప్పుడచ్చిన రోగం
పెయిలవుట్టిందయితే కాదు
ఇది పక్కా కొంటెతనమే
ఆ రోగానికి రోగమచ్చి పొయ్యేదాకా
పాటలు పాడుకుంటూ
అష్టాచెమ్మ, అంత్యాక్షరి, చెస్సు, క్యారంబోర్డు
ఆటలాడుకుంట ఇంట్లనే ఉందాం...
మనల్ని మన బలగాన్ని
మోర్దోపు రోగంనుండి
కాపాడుకుందాం...



-మాధవ్ గుర్రాల
94926 48887



## నానోలు

తరువు
నిస్వార్థం
మనిషి
స్వార్థం

భూకంపం
యాదృచ్ఛికం
సూర్యోదయం
నిత్యం

ఆహారం
బలం
దానం
కీర్తి

జ్ఞానం
అంతర్గతం
సౌందర్యం
ఆకర్షణ

వజ్రం
ఆకర్షణ
ముత్యం
హారం

కల
తీరనిది
స్వప్నం
నిలువ నిది

కథ
ప్రదర్శన
సినిమా
నటన

ఓరుగల్లు
శిల్పకళ
జనగామ
పోరుగడ్డ

గురువు
ఆశీర్వాదం
రాజు
ఆజ్ఞ

కరోనా
అంటువ్యాధి
మిడతల దండు
అతివృష్టి

పేరంటం
ఆహ్వానం
యాత్ర
ఆహ్లాదం

ఊహ
ఆలోచన
ప్రయోగం
ఆవిష్కరణ

వర్షం
బురద
మంచు
పైరా

ఇతిహాసం
యదార్థం
ఐతిహ్యం
కల్పితం

ప్రేమ
ఆకర్షణ
పెళ్లి
బంధుత్వం



-చాపలమహేందర్
9949864152

## కఠిన కరోనాకు హెచ్చరిక

కఠిన కరోనాకు హెచ్చరిక..
నిన్ను ప్రేమిస్తున్న కరోనా..
అస్తవ్యస్తంగా ఉన్న లోకానికి
అస్తమయాన్ని కలిగించి ప్రశాంతతని తీసుకొచ్చావు

నిన్ను ద్వేషిస్తున్నా కరోనా..
లక్షల కుటుంబాలకు సుఖాన్ని దూరం చేసి
శోకాన్ని దగ్గర చేశావ్
నిన్ను ప్రేమిస్తున్నా కరోనా..
బ్రతకడం మాత్రమే నేర్చుకున్న మాకు..
బాధ్యత అంటే ఏంటో తెలియజేశావు.

నిన్ను ద్వేషిస్తున్నా కరోనా..
దేవుళ్ళులా సేవ చేసిన వైద్యులుకు, దెయ్యంలా ఆవహించి
మా ధైర్యాన్ని, పిరికితనంగా మార్చేశావు

నిన్ను ప్రేమిస్తున్నా కరోనా..
కంటికి రెప్పలా మమ్మల్ని కాపాడే పోలీసులకు
కంటి నిండా నిద్ర లేకుండా చేస్తున్నావ్

నిన్ను ప్రేమిస్తున్నా కరోనా..
కంటికి రెప్పలా మమ్మల్ని కాపాడే పోలీసులకు
కంటినిండా నిద్ర లేకుండా చేస్తున్నావ్

నిన్ను ప్రేమిస్తున్నా కరోనా..
డబ్బు మాత్రమే ఉంటే చాలు అనుకొనే మాకు
ఆరోగ్యం ఒక్కటే ఉంటే చాలు అనే గుణపాఠం నేర్పావు

నిన్ను ద్వేషిస్తున్నా కరోనా..
పరిశుభ్రతకు అద్దంలా పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు
ఏమవుతాయో అన్న భయాన్ని కలిగిస్తున్నావు

అయినా నీకు ఒకటి చెప్పాలిఅనుకుంటున్న
నువ్వు మాలో కలుగజేసింది భయం అనుకుంటున్నావు..
కానీ
నీకు తెలియకుండానే మాలో బాధ్యత అనే
బ్రహ్మాస్త్రాన్నీ వదిలేసి వెళ్తున్నావ్
నువ్వు నీ విధ్వంసకర కీర్తిని
నెలబెట్టుకోవాలి అనుకుంటున్నావు..కానీ
మేము మా సమైక్య స్ఫూర్తిని
తెలియజేయాలని అనుకుంటున్నాం

నువ్వు నీ జులాన్ని విధిలిస్తున్నావ్
మేము మా బలాన్ని చూపిస్తున్నాం.
నువ్వు మాకు కీడు చేసిన, మేలు చేసిన మాకు శత్రువువే
ఎందుకంటే విలువైన సమయాన్ని, అంతకంటే విలువైన
మనుషుల్ని మా నుండి దూరం చేస్తున్నావ్
ఈప్రపంచంలో అత్యంత తెలివైన మాకు
అదే ప్రపంచంలో అత్యంత క్రూరమైననీకు
జరుగుతున్న అత్యంత వినాశకర యుద్ధంలో తప్పకుండా
నీకు ఈ లోకం నుండి విముక్తి కలిగిస్తామని ఆశిస్తూ
నీ ప్రియ శత్రువు.

– వి. చిరంజీవి
సెల్: 84980 74531

## నడక

ఆకలికి
అలవాటయిన నడక
నమ్మకాన్ని వమ్ము చేస్తే
సహించలేని నడక
నిర్లక్ష్యాన్ని ఓర్చుకోలేని నడక
మొద్దు నిద్రను తిట్టి లేపే నడక
బండలమీద నిప్పులు విసిరే నడక
నెత్తురోడిన లెక్కచేయని నడక
మండుటెండను దిక్కరించిన నడక

నడక మాని పరుగెడితే
పిడుగులు ఉరుముతాయి
మెరుపులు మెరుస్తాయి
సుడిగాలులు చెలరేగుతాయి
సునామీలు దూసుకు వస్తాయి

నిలదీసి అడిగితే.. నిగ్గు తేల్చి కదిలితే
శ్రామిక శక్తులు.. రగులు తాయి
వలస పక్షులు .. దండు కడతాయి కొడవళ్ళు ..
మొలకెత్తు తాయి
కోయిలలు.. అరుణిమను పాడతాయి
కొత్త వ్యూహాలు.. గజ్జ కట్టి ఆడతాయి

మేము ఇప్పుడు.. అలగా జనం కాదు
చెలరేగిన ప్రభంజనం
ధ్వజమెత్తిన.. జనజీవనం



– బి. గోవర్ధనరావు
సెల్: 9441968930

## ప్రగతి మూలాలు

చిరిగిన జీవిత చొక్కాకు అతుకు వేద్దామని
గూడు వదలి పక్షి గగనానికి వలసపోయింది
కంటి కొలుకుల్లో కట్టిన పుసి తుడుచుకుంటూ
దిన చుక్కలై దేహాన్ని ఎండకు ఎండగట్టి
సిరలలో రక్తానికి ఆహారాన్ని కూర్చుకుంటూ
కండ కొండలను కాస్త కాస్త కరిగించుకుంటూ
కాలం వెళ్ళదీసే బడుగు ముఖచిత్రాల మీద
కరోనా విషపు నల్లసిరా చిందింది
ఊపిరి పోసుకున్నచోటే ఊపిరి ఆపుకోవాలని
కాళ్ళు రహదారితో రాజీ కుదుర్చుకున్నాయి
మనసులో మూలుగుతున్న చిన్న ఆశ
మరణాన్ని లెక్కచేయని దశకు చేరుకుంది
విసిరే విక్రపిండాలను దొరకబుచ్చుకుంటూ
వడి తగ్గని నడకలు సవ్వడి చేస్తుంటే
నేలతో ఘర్షణ పడి రాలగా మిగిలిన ప్రాణాలు
మాంసఖండాలు బయటపడ్డ పాదాలు చీలి
ఎముకల జాడలు పుడమిని తాకకముందే
సమాజ పునాది రాళ్ళను గూటికి చేర్చండి
బ్రతుకు ముఖచిత్రాల పైన నవ్వులు అద్దండి
నడిచే పాదాలను గడపకు చేర్చి
మానవత్వమున్న మనుషులుగా వర్తించండి
దేశ ప్రగతికి మూలాలను విస్మరించకండి
పూలరథాల మీదగాకున్నా
చక్రాలబండి మీద గమ్యాలకు చేర్చండి.

–శింగరాజు శ్రీనివాసరావు
9052048706



పుస్తక సమీక్ష

# అపురూపం "శకుంతల నాటకము"

నాటకం ఎన్నో ఏళ్ళుగా మరుగున పడివున్న కళ. కానీ ఎక్కడైనా నాటక ప్రదర్శన జరిగితే మాత్రం ఎంతో ఆసక్తితో అనేకమంది హాజరవుతుండటం సంతోషం. ఆధునిక యుగంలో టెక్నాలజీ అందరి అరచేతుల్లోకి రావడంతో ఈ కళ కనుమరుగైంది. కానీ ఇప్పటికీ నాటక ప్రక్రియ రచన కొనసాగుతూనే ఉంది. సామలేటి లింగమూర్తి తమదైన శైలిలో శకుంతల నాటకాన్ని రచించారు. మధ్య మధ్యలో పద్యాలు, పాటలను జతచేసి ఎంతో ఆసక్తికరంగా రచించడం విశేషం. ఏ ఏ పాట ఏ రాగంలో పాడవచ్చో ఏ తాళం ఉపయోగించవచ్చో అనేది కూడా అందించి వివరణాత్మకంగా రచించిన తీరు అందరినీ చదివించేలా ఉంది. పూర్వం కాలంలో నాటకాలు రెండు మూడు రోజులు ఉండేది. అలా కాకుండా సామలేటి గారు అందరికీ అర్థమయ్యే రీతిలో ఒక గంటకు సరిపడేలా "శకుంతల నాటకాన్ని రచించారు. శకుంతల నాటకంల పాత్రలను తగు మాత్రం తగ్గించి ఈ తరానికి సరిపడేలా రచించారు. ఇందులోని సారాంశాన్ని ఏ వయస్సు వారైనా అర్థం చేసుకవచ్చు. పాటల్లో భాషను ఎంతో సరళంగా సున్నితంగా అందరూ సులభంగా పాడుకోగలగేలా రచించారు. సాహిత్యాన్ని, సంగీతాన్ని రెంటినీ తీసుకుని నాటకాన్ని పండించగలు గుతున్నారు. విశ్వామిత్రుని తపస్సు భంగము చేయడానికి మేనకను పంపిస్తారు. మేనక తన అందచందాలతో విశ్వామిత్రుని ప్రేమలోకి దింపుతుంది. ఎంతటి తపశ్శాలి అయినా ప్రేమకు దాసోహం అని తెలిపే తీరులో వీరు రచించిన పాట ఎంతో సరళంగా సాగింది " మనసాయెరా మదనా/ నా మదిలోన ఈ వేళ నిను చూడగా/ ముద్రమాయెగా ॥ మన ॥ అంటూ మొదలైన పాటలతో గేయాలతో ఆవిష్కరించారు. నాటక




ఇతివృత్తం పాతదయినా ఎత్తుగడ, నడిపించే తీరులో కొత్తదనాన్ని చూపించారు.

ఇంత చక్కని నాటకాన్ని రచించిన సామలేటి లింగమూర్తి గారికి ఇప్పుడు 84 ఏళ్ళు. తండ్రి నాగయ్య, తల్లి లక్ష్మి. ఎనిమిదేళ్ళ వయసులో ముంబయి వెళ్ళి అక్కడే విద్యాభ్యాసం చేసారు. 1961లో మెట్రిక్ పాసయ్యారు. 1962-1964 సం॥ ల యస్‌జిబిటి ట్రైనింగ్ సిద్దిపేట ప్రభుత్వ హైస్కూల్ పరిధిలో యున్న ట్రైనింగ్ సెంటర్‌లో చదివారు. ఎస్‌జిబిటి ఉత్తీర్ణత తరువాత మిరుదొడ్డి హైస్కూల్‌లో ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. హిందీ, ఇంగ్లీష్, తెలుగు, గణితము, చరిత్ర మానసిక శాస్త్రము మొదలగు సబ్జక్టులను చెప్పేవారు. వీరు బాల్యం నుండే జానపద పాటలు, సినిమా తరహా పాటలు రాయడం మొదలుపెట్టి రాను రాను నాటకాలు, నాటికలు రచించారు. పిల్లలచేత అనేక పాటలు, ఆటలు ఆడించడం ద్వారా ఎంతో ఆనందాన్ని పొందేవారు. కవిత్వం రచించారు. ఏ కవిత్వమైనా సమాజాన్ని మేల్కొలిపే విధంగా ఉండాలని కోరుకుని, తదనుగుణంగా రచించేవారు.

వీరు దేవి స్మరణామృతము, అడవి తల్లి, కావ్య స్రవంతి, స్త్రీ జీవితము, భక్తి మార్గం, ప్రకృతి సంపద, ఇదేమి లోకం, జల సంపద, తెలుగు వైభవము, యాదాద్రి శిల్ప వైభవము, కలియుగ రాజ్యం, పద్య కమలం, పద్య మందారం, పద్యమాలిక, ఒంటరి జీవితం, తెలంగాణ పండుగలు, పిచ్చితనము, బీదల బతుకు అనే పద్య సంపుటిలు, వీర సిపాయి, భక్త మార్కెండేయ, వకుంతల, దేవయాని, సతీసావిత్రి, గంధర్వప్రేమ అనే నాటకాలు, గేయమంజరి, గేయ రంజని, గేయలహరి, గేయ తరంగిణి, పాటల పల్లకి వంటి బాలగేయాలు, భక్త భజనమాల, తెలుగు మధుర గేయాలు, ప్రేమ పావురాలు, జానపద జంగడి, తెలంగాణ మధుర గేయాలు, పాటల సింగిడి, పంచరత్న మంగళహారతులు వంటి పాటల పుస్తకాలు, నీతి పలుకులు, నీతి సుధలు వంటి కవిత్వ సంపుటిలు రచించారు. ఇవే కాకుండా మరో 30 పుస్తకాలు ఆముద్రితాలు ఉన్నాయి. వీరు రచించిన కవితలు, పాటలు, గేయాలు అన్ని పత్రికలలో ప్రచురణ పొందినవే.

ఇన్ని రచనలను పెద్దలు ప్రశంసించి, అనేక పురస్కారాలు అందించారు. గురుజాడ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా( రాష్ట్ర విశిష్ట పురస్కారం), 2017 కృషి కవితకు ప్రపంచ రికార్డు కవి సమ్మేళనంలో విశిష్ట పురస్కారం, గురుజాడ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారిచే 2018 సం॥లో ఆంధ్ర మహా సభలు ముంబయిలో జాతీయ పురస్కారం, పబ్లిక్ సరెంట్స్ హెూమ్ సిద్దిపేట వారిచే ఉత్తమ ఉపాధ్య పురస్కారము వంటివి అనేకం అందుకున్నారు. సహస్ర పద్యకవి అనే బిరుదును కూడా సొంతం చేసుకున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేట జిల్లాలో ఉన్న సామలేటి లింగమూర్తి తాను రచించిన ఈ రచనలన్నీ అమ్మవారి కరుణా కటాక్షాలే అంటారు. తిరుపతి వెంకట కవులు రచించిన "పాండవోద్యోగ విజయం లాగ సామలేటి రచించిన శకుంతల నాటకం ఎంతో విలువైనది. మొదలు పెట్టిన వెంటనే పూర్తయ్యేదాకా చదవాలనిపించే గ్రంథం. "చిరునవ్వు తొలకించె చిన్నారి పాప/ మురిపాలు కురిపించె ముద్దుల పాప/ పురమును ఏలే వరహాల పాప / తరియించె నా జన్మ అందాల పాప" అనే జోలపాటను శకుంతల పాత్రచే పాడించే తీరు ఎంతో రమ్యంగా వుంది.

ఏ ప్రక్రియ అయినా తెలుగు సాహిత్యానికి ఆహ్వానమే. కాకుంటే కాలమాన పరిస్థితుల్లో కనుమరుగు అవుతాయే తప్ప ఉనికిని కోల్పోవు. ఎందుకంటే సామలేటి లింగమూర్తి లాంటి వారు ఈ ప్రక్రియల్ని ముందుకు నడిపిస్తారు. పుస్తకాలు చదివేవారు లేరని ఎంతగా తెలుస్తున్నా రాయటం మాత్రం ఆపలేదు. వేలకు వేలు గ్రంథాలు ముద్రితమవుతూనే ఉన్నాయి. వాటిపై సమీక్షలు, విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. కనుక భాషను ప్రేమించేవారు ఉన్నంతకాలం, కళలను ఆస్వాదించే సమాజం ఉన్నంతకాలం ఏ ప్రక్రియయైనా కొనసాగుతుంది. అలాగే ఒక రచనను ఎంతో హుందాగా నడిపించిన తీరు సామలేటి వారిలో చూడవచ్చు. చక్కని నాటకాన్ని రచించిన ఈ కవి, రచయిత సామలేటి లింగమూర్తి గారికి నా అభినందనములు మరియు నమస్సులు.

ప్రతులకు: సామలేటి లింగమూర్తి
ఇ.నెం.17-85, శ్రీనగర్ కాలనీ
భారత్‌నగర్, సిద్దిపేట
సెల్: 9492912155

–శైలజామిత్ర
9290900879

## మనుషులుగా బ్రతకాలి

అంటరానితనానికి
కాలం చెల్లింది కానీ
అంటరాని కాలమొకటి వచ్చింది
కులం, మతం, జాతి ఏమీ లేవు
అందరూ అంటరానివారే ఇపుడు
పలకరించేందుకు
కరచాలనాలు లేవు
ఆప్యాయతలు తెలిపే
ఆలింగనాలు కరువు
మనసుకు నచ్చినా
భౌతికంగా దూరం పాటిస్తున్నాం.
స్వేచ్ఛా వాయువులు పీల్చిన
ముక్కూ, మూతులను
తెరలతో మూసేశాం
శరీరాలను రక్షణ కవచాలతో కప్పేశాం
అటకెక్కిన అంటు, మడి
ఆచారం, వ్యవహారం
మరో రూపంలో
మళ్లీ తలకెక్కించుకుంటున్నాం.
హద్దులు గీసుకొని
తాళాలు వేసుకొని
గుహల్లో దాక్కుంటున్నాం
ఆది మానవులనూ, ఆధునికులమో
నాగరికులనూ, అనాగరికులమో
తెలియక చస్తున్నాం.
మనసులు చంపుకొని
మర్మంగా బ్రతుకుతున్నాం.
మందో, మాకో
మంత్రమో, తంత్రమో
మరో సంస్కర్తయై రావాలి
నాగరికతకు మళ్లీ వెలుగు తేవాలి
మరబొమ్మలుగా కాదు
మనమంతా
మనుషులుగా బ్రతకాలి.

– ఎస్. మోహన్‌గౌడ్
సెల్: 944064503



# నిరంతర స్ఫూర్తి డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య

“పల్లె కవులంతా పట్నం బాట పడుతున్న ఈ రోజుల్లో పుట్టిపెరిగిన ఊరిపై సతత హరిత ఆత్మీయతను పెంచుకొని వెల్లంకి కేంద్రంగా ఉంటూ యాదాద్రి భువనగిరి జిల్లా సాహిత్యానికి గొప్ప స్ఫూర్తిని కలిగిస్తున్నారు”

**పల్లియలోనె పుట్టితిని పల్లియయే నను పెంచె, పల్లియే**
**ఇల్లును వాకిలిన్ కలిమినిచ్చె బతుక్కు మెరుంగుపెట్టె, ఆ**
**పల్లియె 'అమ్మ' 'ఆవనుచు' పల్కులు పల్కగ నేరిపించె, నా**
**పల్లియె నాకు దైవతము ప్రాణము ఓ ప్రభు విఠ్ఠలేశ్వరా!**

పల్లెనే సర్వస్వంగా భావిస్తూ, ఆ పల్లెపట్టుననే ఉంటూ సారస్వత సేవను గత ఏడు దశాబ్దాలుగా నిరాఘాటంగా చేస్తున్న అరుదైన సాహితీమూర్తి డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య. సాంప్రదాయంలోంచి ఎలుగెత్తిన విప్లవాక్షరం.

## బాల్యం:

యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం, నీరునెముల గ్రామంలో అమ్మమ్మ ఇంట్లో జూలై 9, 1938లో జన్మించారు. వీరి తండ్రి కూరెళ్ళ వేంకటరాజయ్య తల్లి లక్ష్మమ్మ. ఐదునెలల పసిగుడ్డుగా ఇంకా కన్నులు తెరిచి లోకాన్ని స్పష్టంగా చూడలేని వయసులో తండ్రిని కోల్పోయారు. అప్పటికి పదహేనేళ్ళు మాత్రమే ఉన్న తల్లి ఎన్నో కష్టాలను, కన్నీళ్ళను, ఎన్నో అవాంతరాలను ధైర్యంగా ఎదుర్కొన్నది. తన బిడ్డను బతికించుకున్నది. అందుకే కూరెళ్ళగారు..

**“నాన్న విడిచి వెళ్ళె నను చిన్ననాట**
**అమ్మ అలవికి మించి కష్టమ్ము నోర్చి**
**విద్దెలను బుద్ధులను నేర్పిదిద్దె**
**ఇంత వానిగ జేసె నేనేమి ఇడుదు”** అంటారు.

తాత బేతోజు లక్ష్మీనారాయణ కనుచూపులో కూరెళ్ళగారు ఎదిగి వచ్చారు.

## విద్యాభ్యాసం:

నీరునెములలోని పీర్లకొట్టంలో మహసూలదార్ అనే వస్తాదు వద్ద మొదటగా ఆచార్యులవారు అక్షరాభ్యాసం చేశారు. ఉర్దూ మాధ్యమంగా చదువు మొదలయింది. కొంతకాలానికి సొంత ఊరైన వెల్లంకికి మకాం మారింది. అక్కడ షేక్ అహ్మద్ అనే ప్రైవేటు ఉపాధ్యాయుని వద్ద విద్యనభ్యసించారు. నెల ఫీజు చెల్లించలేక పాఠశాల ఊడ్చి, గురువుకు సేవలు చేస్తూ చదువు కొనసాగించారు. ఇలాంటి సమయంలో ఆ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభమయింది. దీనిని ఆరోజుల్లో ధర్మబడి అని పిలిచేవారు. ఆ పాఠశాలకు వచ్చిన ప్రభుత్వోపాధ్యాయుడు తుల్జారామ్‌సింగ్ బాగా పాఠాలు బోధించారు. బల్‌క్షైదా, అవ్వల్, దువ్వం, సువ్వం (శిశు నుండి మూడవ తరగతి) వరకు చదువుకొని పై తరగతికి రామన్నపేట పాఠశాలలో చేరారు. అక్కడ ఏడవ తరగతి వరకు చదువుకున్నారు. ఇదే సమయంలో తనను ఎంతో ప్రేమగా చూసుకొనే తాతగారైన బోతోజు లక్ష్మీనారాయణ మరణించారు. అందుకు మిక్కిలి దు:ఖిత మతుడైన కూరెళ్ళ వారు పద్యాలలాంటి (ఛందో నియమం లేని) వాటిని రాశారు. ఇలా పన్నెండవ ఏటనే తనలోని కవితాహృదయం స్మృతి కావ్యంగా బయల్పడింది. కూరెళ్ళ బాల్యంలోనే కవిగా బలమైన అడుగులు వేశారు. పాఠశాల విద్యార్థిగా 'విద్య' అనే నాటకాన్ని రాసి, అందులో సుగంధరెడ్డి అనే పాత్రను ధరించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. 'గురుదక్షిణ', 'లంకాదహనం', 'భక్త కన్నప్ప' నాటకాలలో ఏకలవ్య, హనుమంతుడు, కన్నప్ప మొదలైన పాత్రలు వేశారు.

ఆ తరువాత ఉన్నత పాఠశాల విద్యకై భువనగిరికి చేరుకొని 'విశ్వకర్మ వసతి గృహం'లో ఉన్నారు. హాస్టల్ నిర్వహణకై ఇవ్వాల్సిన నామమాత్రపు రుసుం కూడా చెల్లించలేని స్థితి. దగ్గరి బంధువులు కొందరు తలా పావలా బేడ సాయంచేశారు. వారాలు చేస్తూ చదువుకున్నారు. కోవెల సంపత్కుమారాచార్య, అప్పలాచార్య శిష్యరికం లో కవిగా మెరుగులు దిద్దుకున్నారు. ఛందోవ్యాకరణ విషయాల్లో పట్టును సాధించారు. 1954లో అధిక వర్షం కారణంగా జనగాం జిల్లా రఘునాథపల్లి వద్ద ఘోర ప్రమాదంలో రైలు వాగులో పడిపోయింది. పలువురు మరణించారు. ఈ సంఘటన కూరెళ్ళగారి మనసును కదిపింది. ఈ సంఘటనపై 'అధిక వృష్టి' శీర్షికతో పద్యాలు చెప్పారు.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ 'మహాకవి డా॥ దాశరథి సాహితీ పురస్కారం' రవీంద్రభారతిలో డా॥ కూరెళ్ళ విఠలాచార్యకు అందజేస్తున్న దృశ్యం. చిత్రంలో బాదిని శివకుమార్, డా॥నందిని సిధారెడ్డి, డా॥కె.వి.రమణాచారి, హెూంశాఖామాత్యులు మహమూద్ అలీ, సాంస్కృతిక శాఖామాత్యులు శ్రీనివాస్ గౌడ్, బీసీ కమీషన్ ఛైర్మన్ బి.యస్.రాములు, మామిడి హరికృష్ణ.

**ఉరుములు మెరుపులు నొకసారె ఉద్భవించె**
**గాలి సుడిగాలి మేఘముల్ కప్పుకొనియె**
**సరవి ధారగా వర్షంబు కురియుచుండె**
**అల్ల తెలంగాణ రఘునాథ పల్లియందు.**

సహజకవిగా పై పద్యం కూరెళ్ళగారిలో కవితాశక్తిని పట్టి చూపుతుంది. అంతేకాకుండా కరుణశ్రీ 'పుష్పవిలాపం' చదివి ప్రేరణ పొంది 'గో విలాపం' కావ్యం రాశారు.

**అన్ని పాల నీ మురిపాల ఆవుదూడ**
**పీల్చినట్టయితె నేనేమి పితుకగలను**
**పితుకనట్టైతె నేనేమి గతుకగలను**
**గతుకనట్టైతె నేనెట్లు బతుకగలను**

–ఆవుకు, యజమానికి మధ్య జరిగిన ఊహాత్మక సంభాషణను చక్కని కథనంగా రక్తి కట్టించారు.

పాఠశాల కుడ్యపత్రిక 'ఉదయ'లో ఇది ప్రచురింపబడింది. ఎనిమిదవ తరగతి చదువుతున్నప్పుడే దీనికి విద్యార్థుల తరపున సంపాదకులుగా వ్యవహరించడం వారి ప్రతిభకు నిదర్శనం.

తీవ్ర ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నప్పటికీ వీటన్నింటిని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటూ పాఠశాల విద్యను కొనసాగించారు. ఇక్కడ కూరెళ్ళవారి నీతి, నిబద్ధతను తెలియజేసే ఒక విషయాన్ని తప్పక ప్రస్తావించాల్సిందే. వీరికి ప్రతిభ, మరియు ఆర్థికంగా వెనుకబడిన వారికిచ్చే ఉపకారవేతనాలు రెండూ వచ్చాయి. ఒక విద్యార్థి రెండు ఉపకార వేతనాలు పొందడం సరికాదన్న ఆలోచనతో ప్రధానోపాధ్యాయుల వద్దకు వెళ్ళి తాను ప్రతిభకు ఇచ్చే ఉపకార వేతనం ఉంచుకొని మరో ఉపకార వేతనాన్ని వదులుకోవాలనుకుంటున్నానని రాతపూర్వకంగా రాసి ఇచ్చారు.

హెచ్చెస్సీ పూర్తయిన తరువాత పై తరగతులకు హైదరాబాదుకు వెళ్ళి చదువుకోవాలి. హైస్కూలు చదువులే కష్టంగా పూర్తిచేసిన అనుభవం, అందుకై తల్లి పడిన శ్రమ గుర్తు చేసుకొని ఏదైనా ఉద్యోగం చేసి తల్లికి సహాయపడాలన్న తలంపుకు వచ్చి పై చదువులకై హైదరాబాదుకు వెళ్ళాలనే ఆలోచనను విరమించుకున్నారు.

## ఉద్యోగజీవితం:

మొదటగా వీరు ఇరవై రూపాయల వేతనానికై కో ఆపరేటివ్ కార్యాలయంలో చేరారు. తరువాత భువనగిరి న్యాయస్థానంలో జడ్జి వద్ద కాపీరైటర్‌గా, సేల్స్‌టాక్స్ డిపార్టుమెంటు కార్యాలయంలో, ఎలక్ట్రిసిటీ కార్యాలయంలో ఎల్డీసీగా బతుకుపోరులో చిన్నచిన్న ఉద్యోగాలు చేశారు. ఈ ఉద్యోగాలు తనకు తగినవి కాదని నిశ్చయించుకొని మేడ్చల్‌లోని ఉపాధ్యాయశిక్షణా కళాశాలలో బి.టీ.ఎస్. లో చేరారు. శిక్షణా కాలాన్ని విజయవంతంగా పూర్తిచేసుకొని రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన వారిలో ఒక్కరిగా గుర్తింపును పొందారు.

29-09-1959న మునిపంపుల పాఠశాలకు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మొదటి నియామకం. కొంతకాలం పనిచేసిన తర్వాత భువనగిరి మండల పరిధి గ్రామమైన వడాయిగూడెం పాఠశాలకు బదిలీ అయ్యారు. రాష్ట్రప్రభుత్వం కన్నా ముందే వయోజన విద్య ఉద్యమాన్ని చేపట్టిన ఘనత డాక్టర్ కూరెళ్ళవారికే దక్కుతుంది. ఇంటింటికీ తిరిగి నిరక్షరాస్యులైన వయోజనులకు అక్షరాలను పరిచయం చేశారు. అక్షరం విలువ తెలిపే 'మనకథ' పేరుతో బుర్రకథను, 'సింగి-సింగడు' నాటకాన్ని రాసి విద్యార్థులతో ప్రదర్శింపజేసి ప్రజలలో చదువుకోవాలన్న జిజ్ఞాసను తీసుకరాగలిగారు. గోకారం, సిరిపురం, వెల్లంకి, సిరిపురం, వలిగొండ, సంగెం...ఇలా పనిచేసిన ప్రతి పాఠశాలలో గోడపత్రికలను విద్యార్థులచే నిర్వహింపజేస్తూ వారిలో దాగిన సృజనశక్తిని, రచనాశక్తిని బయటకు తీశారు. బాపూభారతి, మనతెలుగుతల్లి, వలివెలుగు, చిరంజీవి, ప్రియంవద, ముచుకుంద..మొదలైనవి ఆ కోవలో వచ్చిన కుడ్యపత్రికలే.

తెలుగు లెక్చరర్‌గా పదోన్నతి పొంది నల్లగొండ, రామన్నపేట జూనియర్ కళాశాలలో పనిచేశారు. అక్కడ కూడా కుడ్యపత్రికలను నిర్వహించి విద్యార్థులలో సాహిత్యం పట్ల ఆసక్తి కలిగేలా తీర్చిదిద్దారు. అంతేకాకుండా గ్రామస్తుల్లో సామాజిక బాధ్యతను గుర్తింపజేస్తూ గ్రామాభివృద్ధికి పాటుపడేలా కార్యక్రమాలు చేస్తుండేవారు.

పరిశోధన:

ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే తెలుగుసాహిత్యంలో పరిశోధన చేయాలన్న తపనతో ఆ రంగంలో విశేష కృషి చేశారు. తెలుగులో వినూత్న ప్రక్రియ 'గొలుసుకట్టు నవలలు' అన్న అంశంపై పరిశోధన చేసి ఎం.ఫిల్.పట్టా పొందారు. 'తెలుగు నవలల్లో స్వాతంత్ర్యోద్యమ చిత్రణం' అన్న అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. 'స్వాతంత్ర్యోద్యమం- ఆంధ్రప్రదేశ్‌లో దాని స్వరూపం' అనే పేరుతో మరో విలువైన పరిశోధనాత్మక చారిత్రక గ్రంథం రాశారు.



తేజ ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాయ గానసభలో డా॥ కూరెళ్ళ విఠలాచార్యను సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో జైస దేవదాసు, డా॥నందిని సిధారెడ్డి, డా॥పోరెడ్డి రంగయ్య, సి.వి.శ్రీనివాస్, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, డా॥ గంటా జలంధర్‌రెడ్డి, వాకిటి రాంరెడ్డి.

### నానీ నేత్రాలు

కాళోజీ అంటే
మన గొడవ
మమేకమైతే
మనకేం కొదవ.

అవును, అది
చిరు దీపమే
కాల్చి పారేస్తుంది
చీకట్ల పాపం.

నేల విడిచి
సాము చేయడు
రైతు నేలను
నమ్ముకున్న వాడు.

పల్లె నాకు ప్రాణమని
కైత రాస్తాడు
కానీ ఆ కవి
పల్లె వైపైనా చూడడు.

ఆయనకన్ని
రాగాలూ తెలుసు
తెలియని దొక్కటే
అనురాగం.

ఏ భాషలోనైనా
అమ్మకు ఉపమానం అమ్మే
మరో పదం
చెప్పండి చూద్దాం.

జయశంకర్
సర్వస్వం త్యాగం చేశాడు
తెలంగాణ చీకట్లను
చీల్చిన ఘనుడు.

**-డా॥ కూరెళ్ళ విఠలాచార్య**

“విద్యార్థిగా ఉన్నప్పుడు పుస్తకాల కోసం తను పడ్డ ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఇందుకు ప్రధాన కారణం పేదరికమే. అలాంటి పరిస్థితులు విద్యార్థులకు, పరిశోధకులకు, చదువలరులకు ఎదురుకావొద్దన్న ఆలోచనతో తన స్వంత ఇంటినే గ్రంథాలయంగా మార్చి లక్ష గ్రంథాలను సమకూర్చారు”.



యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ఆవిర్భావ సమావేశం (భువనగిరి)లో వ్యవస్థాపకులుగా ప్రసంగిస్తున్న డా॥ కూరెళ్ళ విఠలాచార్య.



భువనగిరిలో డా॥ కూరెళ్ళ విఠలాచార్య రచించిన 'నానీ నేత్రాలు' కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్.గోపి.

## రచనలు:

డాక్టర్ కూరెళ్ళగారు విద్యార్థి దశనుంచి చక్కని చిక్కని రచనలు చేస్తూ వస్తున్నారు. అందులో సామాజిక స్పృహతో రాసిన పద్యకృతి విఠలేశ్వర శతకం. ఇది గొప్ప గుర్తింపును పొందింది. ఈ శతకంపై తమిళనాడులోని మధురై కామరాజు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి రెబ్బ మల్లికార్జున్ ఎం.ఫిల్. పట్టాను పొందారు. నృత్యంజలి, కవితాచందనం, తెలంగాణ కాగడాలు, సీసమాలిక, శిల్పాచార్యులు, వంద శీర్షికలు-వంద సీసాలు, మావూరు వెలుగు, వెల్లంకి గ్రామ చరిత్ర, కవిరాజు ఏలె యల్లయ్య(సంక్షిప్త జీవితచరిత్ర), చద్దిమూటలు (ప్రముఖుల 5,555 ఉట్టంకణాలు), సింగి-సింగడు (అక్షరాస్యత ప్రచార నాటకం), మనకథ (అక్షరాస్యత ప్రచార బుర్రకథ), కాన్ఫిడెన్షియల్ రిపోర్టు (వచన కవితాసంపుటి), తెలంగాణ ఉద్యమ కవితలు, కూరెళ్ళ నానీలు, గో విలాపం (బాల సాహిత్యం), ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రజాకార్ల కొన్ని దురంతాలు...ఇలా 23 గ్రంథాలు రాశారు. గ్లకోమా చూపును మందగింప జేసినప్పటికి తన సాహిత్యకృషిని తగ్గించలేదు.



డా॥ కూరెళ్ళతో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ఏనుగు నరసింహారెడ్డి, తేజ సాహితీ సంస్థ అధ్యక్షుడు డా॥పోరెడ్డి రంగయ్య.



సుప్రసిద్ధ సాహితీవేత్త కపిలవాయి లింగమూర్తితో డా॥కూరెళ్ళ విఠలాచార్య, డా॥పోరెడ్డి రంగయ్య, శ్రీమతి పోరెడ్డి రాజేశ్వరి.

## స్థాపించిన సంస్థలు:

కూరెళ్ళగారు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పలు సాహిత్యసంస్థలను స్థాపించారు. అందులో అక్షర కళాభారతి-చౌటుప్పల, సాహితీస్నేహితులు, సాహితీ మిత్ర మండలి, చైతన్య కళాస్రవంతి, బాలభారతి--రామన్నపేట, భువనభారతి-భువనగిరి, ప్రజాభారతి-మోత్కూరు, మిత్రభారతి-నల్లగొండ, జనభారతి-నార్కట్‌పల్లి, మల్లెలభారతి-కొండమల్లెపల్లి, యాదాద్రిభువనగిరి రచయితల సంఘం..ఇలా దాదాపు 30 సంస్థలకు పైగా స్థాపించారు. పల్లెలే శ్వాసగా ఆ పల్లెల్లోనే సాహిత్య పరిమళాలను నలుదిశలకు వ్యాపింపజేస్తున్న సాహిత్యమూర్తి డాక్టర్ కూరెళ్ళగారు. పలు విద్యాసంస్థలు కూడా వారి స్ఫూర్తితో ప్రారంభమయ్యాయి.

## పురస్కారాలు:

ఏడు దశాబ్దాలకు పైగా సాగి వచ్చిన సాహిత్యసృజన, సేవలకు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు సత్కారాలు అందుకున్నారు. 2019 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'మహాకవి దాశరథి పురస్కారం' అందజేసింది. ప్రపంచ తెలుగు మహాసభలు 2017 సందర్భంగా ప్రత్యేక సత్కారం చేసింది.

తేజ సాహితీ సేవాసంస్థ, శాతవాహన విశ్వవిద్యాలయం, చింతల ఫౌండేషన్, అమ్మయాది, పెండెం ఫౌండేషన్, ఆర్యవైశ్య సత్రం-బాసర, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్సు వంటి పలు సంస్థలు జీవనసాఫల్య పురస్కారాలతో సత్కరించాయి. శతాధిక పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు. డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డాక్టర్ జనువాడ రామస్వామి, పెండెం జగదీశ్వర్, బండ్ల కృష్ణ, బొడ్డు వేంకటేశం, గంజి నరసింహ, దాసోజు జ్ఞానేశ్వర్ తమ రచనలను అంకితమిచ్చారు.



డా॥కూరెళ్ళ విఠలాచార్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ 'దాశరథి సాహితీ పురస్కారం' అందుకున్న సందర్భంగా సత్కరిస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు.



భువనగిరిలో డా॥ కూరెళ్ళ విఠలాచార్యను సత్కరిస్తున్న ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎన్.గోపి.

## బిరుదులు:

డాక్టర్ కూరెళ్ళగారు కవిగా, రచయితగా, విమర్శకులుగా, వ్యాసకర్తగా, సాహిత్య సామాజిక ఉద్యమ కార్యకర్తగా బహుముఖీనమైన సేవలు అందిస్తున్నారు. ఆ క్రమంలో అనేక సంస్థలు బిరుదులు, అందించి తమను తాము సత్కరించుకుంటున్నాయి. మధురకవిగా, అభినవ పోతనగా సాహితీ లోకంలో సుప్రసిద్ధులైన డాక్టర్ గారిని సుధీతిలకం, కవితాశ్రీ, సాహిత్యప్రపూర్ణ, కవిభూషణ, అక్షరకళాసమ్రాట్టు, ఆచార్య లాంటి ఎన్నో బిరుదులు వారిని వరించాయి.

## సొంత ఇంటినే గ్రంథాలయంగా:

విద్యార్థిగా ఉన్నప్పుడు పుస్తకాల కోసం తను పడ్డ ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఇందుకు ప్రధాన కారణం పేదరికమే. అలాంటి పరిస్థితులు విద్యార్థులకు, పరిశోధకులకు, చదువలరులకు ఎదురుకావొద్దన్న ఆలోచనతో తన స్వంత ఇంటినే గ్రంథాలయంగా మార్చి లక్ష గ్రంథాలను సమకూర్చారు. దాతల సహకారంతో యాభై లక్షల రూపాయల వ్యయంతో గ్రంథాలయం కోసం నూతనంగా పక్కా భవనం నిర్మిస్తుండడం విశేషం. ఆచార్య కూరెళ్ళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆచార్య కూరెళ్ళ గ్రంథాలయం ఏర్పడింది. దీనిని మరో తెలంగాణ వేటపాలెంగా తీర్చిదిద్దాలన్నది వీరి సంకల్పం. వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పరిశోధకులు సమాచార సేకరణ కోసం ఈ గ్రంథాలయానికి రావటం గమనార్హం.

సమాజ శ్రేయస్సుకై ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి తన ఇంటినే జాతికి అంకితం చేశారు. అంతేకాకుండా తన స్వగ్రామం వెల్లంకిలోని పేదలకు ప్రభుత్వం ఇళ్ళు మంజూరు చేసింది. ప్రభుత్వ ధరకు అందుకవసరమైన భూమిని ఇవ్వడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. అప్పుడు పేదలకు వచ్చిన ఈ అవకాశం కోల్పోరాదన్న ఆశయంతో తాను సంపాదించుకున్న ఆరెకరాల సారవంతమైన వ్యవసాయభూమిని నామమాత్రపు ధరకు ప్రభుత్వానికి అప్పగించిన వదాన్యత ఆచార్యుల వారిది.

## ఉద్యమశీలి:

బాల్యంనుంచి సామాజిక అవగాహనతో రచనలు చేస్తున్న డాక్టర్ కూరెళ్ళగారు తెలంగాణ రాష్ట్ర సాధన తొలి, మలిదశ ఉద్యమాల్లో చురుకైన పాత్ర నిర్వహించారు. విద్యార్థిగా తొలిదశ, ఉపాధ్యాయులుగా మలిదశ ఉద్యమంలో ప్రభావశీలమైన పాత్రను పోషించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఊరూరా తిరిగి ప్రజాచైతన్యం కలిగించడంలో తనవంతు కృషి చేశారు. నల్లగొండలో ఏర్పాటైన విశ్వవిద్యాలయానికి పోతన పేరు పెట్టాలని పెద్ద ఉద్యమాన్ని నడిపారు. పల్లె కవులంతా పట్నం బాట పడుతున్న ఈ రోజుల్లో పుట్టిపెరిగిన ఊరిపై సతత హరిత ఆత్మీయతను పెంచుకొని వెల్లంకి కేంద్రంగా ఉంటూ యాదాద్రి భువనగిరి జిల్లా సాహిత్యానికి గొప్ప స్ఫూర్తిని కలిగిసున్నారు. ఇప్పుడు కూరెళ్ళగారికి 82 సంవత్సరాలు పూర్తయి 83వ పడిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా స్ఫూర్తిమంతమైన వారి జీవితం, సాహిత్యం నెమరువేసుకోవడం ద్వారా కార్యదక్షులైన వారు జీవితంలో తామెన్ని కష్టాలు పడినా సమాజాభ్యున్నతికి ఎలా పాటుపడతారో తెలుసుకొని స్ఫూర్తిపొందడం మన విధి.

***(ఈ నెల9న సహస్ర పూర్ణ చంద్రదర్శనం పూర్తి చేసుకుంటున్న శుభవేళ)***

**-రెబ్బ మల్లికార్జున్**
9701047345



### కొలనుపాక

ఏలికలెందరో పాలన చేసిన
ధీరుల శూరుల వీరభూమి
వివిధ మతాలకు విఖ్యాతమైనట్టి
మతముల గురువుల మహిమ భూమి
అద్భుత శిల్పాల కాలవాలమయిన
భవ్య నిర్మాణాల దివ్యభూమి
చారిత్రకాంశాల శాసన సంపద
పుష్కలముగనున్న పుణ్యభూమి

కవులు గాయకులు చరిత్రకారులెల్ల
తరలివచ్చి వసించిన ధన్యభూమి
మరల మరల చూడాలన్న సిరులభూమి
మా “కొలనుపాక” మాకెంతో మాన్యభూమి.

**-డా॥ కూరెళ్ళ విఠలాచార్య**





















## మేఘాలు జీవప్రాణాలు...!

నీలినింగిన మేఘాలు
గాలిన వర్ష రాగాలు
దూది పింజల్లా తేలుతు
మనసు కిల సంతోషాలు!

గగనం కాదుగ శూన్యము
చుక్కల వెన్నెల వైనము
ప్రేమ మేఘ సందేశం
కాళిదాసు మహాకావ్యం!

ఉరుములతొ వానలు కురియు
పిడుగుల మెరుపులతొ జడియు
పొలాలలో పడగానే
హాలికుల మనసులు మరియు!

రైతు పంటలకు మూలము
ఆకలి తీర్చుడి జీవము
మానవ మనుగడకు మేలు
అన్నపూర్ణయే మేఘము!

జడమనుకునే మేఘాలు
జలధిని త్రాగె రాగాలు
వడిగ వర్షా కాలంలో..
మబ్బులతో జల ధారలు!

మేఘాలు నింగిన లేక
ప్రజలకిల ఆకలి కేక
సరిగ వానలు కురియంగ
సాగు రైతు ఏరువాక!!!



**-శ్రీమతి చింతోజు పద్మావతి**
8464954860

## భవిష్యత్తుకు భరోసా నాన్న

నడక నేర్పేది నాన్న
నడత నేర్పేది నాన్న
భవిష్యత్తుకు భరోసా
మనకు చేయూత నాన్న

తెలియని కన్నీరుతో
కనిపించని ప్రేమతో
మనల్ని కనిపెట్టును
మదినిండా ప్రేమతో

ఆత్మీయతను పంచును
స్ఫూర్తినెంతో నిచ్చును
గెలుపుఓటములలో
మన వెన్నంటి ఉండును

తన కోపం క్షణకాలము
తన తపన ఎల్లకాలము
మన ఆశయం కొరకు
తన త్యాగం చిరకాలము

ఆదర్శ జీవితంతో
కుటుంబంపై ప్రేమతో
అండగా నిలుచును నాన్న
అంబరమంత మనసుతో



**-కందుకూరి భాస్కర్**
9703487088

## వసంతంలో శిశిరగీతం..

తప్పించుకొనాలని కృతనిశ్చయంతో
ఎంతగా ప్రయత్నించినను
ప్రతిదినం పదునైన కత్తివేటుకు
రక్తపు చుక్క నేలవాలుతుంటే,
దెబ్బదెబ్బకు ప్రాణం గిరికీలు కొడ్తూ
మెలికలు తిరుగుతుంది
కరడుగట్టిన కరకు దెబ్బకు
నాజూకు మొహం వాచిపోతుంటే,
ప్రాణానికున్న తీపి ముందర
అనుబంధం, మానవత్వం
వివస్త్రలా మారి వింతగొల్పుతూనే ఉంది..

ప్రపంచంలో ప్రియాతిప్రియమైన
ప్రాణహృదయాన్ని గుప్పిట్లో దాచిపెట్టి
ప్రాణానికి ఆధారమైన ఊపిరిదారాన్ని
భద్రంగా వస్త్రాల్లో మూటగట్టి
విచ్చుకత్తులైన అరచేతుల వల్ల కల్గిన
పచ్చిగాయాల్ని దాచుకుని
సిగ్గుతో ముఖాన్ని ముడుచుకుని
పట్టుదలతో పిడికిలిని బిగించి
ధృతరాష్ట్రకౌగిలిని దృఢంగా విదిలించి
ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేస్తున్నాను..

వసంత ఋతువు వచ్చింది కానీ
నా చుట్టున్న పూలవనంలో శిశిరంలా
నేడు రోజొక పువ్వు రాలిపోతూనే ఉంది
ఊపిరితీగ వాడిపోతుంటే
రోజొక మొక్క పచ్చదనాన్ని
కోల్పోతూనే ఉంది
జీవనిర్జీవ సంగ్రామంలో జీవ
మనుగడ మెల్లిగా జారిపోతూనే ఉంది
ప్రాణం వానచినుకులా మారి
ఇంటి చూరు నుండి రాత్రంతా
కారుతూనే ఉంది..

**-సర్ఫరాజ్ అన్వర్**
9440981198

## తనూ నేనూ!

తనూ నేనూ ఒక వాక్యం
కళ్ళతో చూస్తే ఇద్దరం
రెండు విడి విడి వాక్యాలు
అల్లుకున్న దృశ్యమే
ఏ వాక్యానికి ఆకలేసినా దాహమేసినా
మరో వాక్యం వడ్డించిన విస్తరవుతుంది
దుఃఖమూ అంతే
రెండు కళ్ళు నాలుగై ప్రవహిస్తాయి
సంతోషమైతే
చెప్పనలవి కాదు
విడిగా అనుభవించలేని
వింత అనుభవం!
నాలుగు పాదాల పద్యంలా
ప్రయాణాలు అలా..అలా...!
మాటలు అర్థాలు మోయలేనప్పుడల్లా
ఇద్దరం ఒకేసారి తలూపడం
అప్రయత్న వింత దృశ్యం!
పిలవకుండానే
ఒక్కోసారి మా ఇద్దరినీ
గాలి కూడా పోతూ పోతూ
ఆగి చూసిపోతది!!



**-కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261.

## నాన్న నడిచిన నేల

నాలుగు దిక్కుల్లో
ఏ దిక్కును చూడమంటావ్
ఏ దిక్కు చూసినా
నీ నవ్వుల నజరానాలు
తళుక్కున మెరుస్తూనే ఉన్నాయ్
చిత్ర పటంలా ఉన్న చేనును చూస్తే
నీశ్రమ విలువేంటో అట్టే తెలుస్తుంది
నడుం వంచి పనిలోకి దిగితే
పొద్దే ఓడిపోయేది
చిందించిన చెమట చుక్కలు
చిగురుకు చీనాంబరాలు అద్దేవి
చినుకు చిందేస్తే
నీ మేను పులకించేది
పంటే ప్రాణమై
పోరాడుతూ
పరిగెత్తిన పరుగులెన్నో
పడి లేస్తూ మానని పంట గాయాలెన్నో
కలలైతే కన్నావు గానీ
కాలం ఎందుకు నిన్ను గాయం చేసిందో
ఆరుగాలం నీ శ్రమకు
ధరణి దండాలు పెట్టిండొచ్చు
ధర లేక నీ పంటో నువ్వో ఓడిపోయి ఉండొచ్చు
నువ్వు పండించిన ధాన్యం నలుగురికీ
నాలుగు మెతుకులై
నవ జీవనాన్ని అందించి ఉండొచ్చు
కాలం పరుగులో జీవన కాంతులు లేని కర్షకుడిగా
కన్నీటి సుడుల్ని ఎన్నో చవి చూసావు
కమ్మని కలల్ని మాకిచ్చి
కనుమరుగయ్యావు
నువ్వు నడిచిన నేల
జీవన గమనంలో నీ అడుగులు
నాకెప్పుడూ మరపురాని
మేల్కొలుపు మడుగులు



**-మహబూబ్ బాషా చిల్లెం**
9502000415

## గజల్

అమ్మమాట నింపుతుంది గుండెలోన ఆనందము
ఆపలుకే ఒంపుతుంది మనసులోన ఆనందము

ఆ చూపులు దీవెనలుగ వెల్లివిరిసిబతుకంతా
నమ్మికతో పంచుతుంది లేమిలోన ఆనందము

ఆనవ్వులు మల్లియలుగ విరబూయుచు
అమృతముగా కురుస్తుంది భువి లోన ఆనందము

ఆ మమతలె ఆనందపు హరివిల్లులై ఉదయిస్తూ
అనునిత్యము జనిస్తుంది అవనిలోన ఆనందము

స్నేహవనము కవనవిరులై రాణిస్తే
'ఓసీతా' మురుస్తుంది జగములోన ఆనందము



**-సోంపాక సీత**
8639311050

## పోరాటం

రోగాన్ని..
నయం చేయలేనప్పుడు
రోగి మరణించడమే
మందన్నది పాత మాట !

జనన మరణాల్ని
హృదయ స్పందనల్ని
ఉచ్ఛ్వాస నిశ్వాసల్ని
అనాటమీ రహస్యాల్ని
పక్కాగా పసిగట్టేది వైద్యులే !

నాడీ పట్టుకుని
స్టెతస్కోపుతో జవజీవాల్ని
చేకూర్చేది ఇలపై వెజ్జులే !

సృష్టికర్త అమ్మో , బ్రహ్మో
ఆరోగ్య స్థితికారుడు మాత్రం
అందరూ మొక్కే డాక్టరే !

సరిహద్దుకు అవతల
యుద్ధం చేస్తేనే చేసినట్టు కాదు
అప్పుడప్పుడు..
దేశం లోపల కూడా క్రిములతో
సమరం చేయాల్సి ఉంటది !

ఎక్కన్నైనా రణరంగంల
వీరోచితంగ పానాలు తీసుడుంటది
ఇది విచిత్ర యుద్ధం
ఇక్కడ ప్రాణాలు కాపాడుడుంటది !

క్షీర సాగరాన్ని మథిస్తేనే కదా !
ఆఖరికి అమృతం బయట పడ్డది
ఆలోచనల్ని చల్లలా చిలికితేనే కదా !

అన్వేషణ జీవితాల్ని నిలబెట్టేది.
ఇప్పుడు తెల్లకోటు..
మనిషి ఆయువుకు ప్రతీక
ప్రాణాల్ని పణంగ పెట్టిన
మహోజ్వల త్యాగ గీతిక
దేశదేశాలు గర్వించే
మహోన్నత జాతీయ పతాక !

ఈ ఆర్మీ ఆఫ్ వైట్ కోట్స్
ప్రపంచపు..
చిక్కటి దుఃఖపు చారికల్ని
ఆనంద భాష్పాలుగ మార్చే
మట్టిపై ఊపిరి మొలకలు !

**-అశోక్ అవారి,**
9000576581

## నేరమెవరిది...?

మద్యం మత్తుకు
కట్టుకున్న భార్యను
రోకలి బండతో పచ్చడి
చేసాడో కసాయి భర్త....

తాళి కట్టిన భర్తే
కాలయముడై
తల పగులగొట్టాడు
మద్యం మత్తులో...

ఇలాంటి వార్తలు
గాంధీ కలలు కన్న
భారతావనిలో....
రాని రోజులు రావా...?

మద్యానిదా
తాగినోనిదా,
అమ్మినోనిదా
నేరమెవరిదని

ప్రధాన ప్రసార
మాధ్యమాల్లో
మేధో మథనపు చర్చలేనా..?

ఇంకెంత కాలం..
భరించాలి
సహించాలి
మౌనంగా ఈ మహిళా లోకం...?

ఆపేవారే లేరా
ఈ దారుణాలు
దురాగతాలు
దుర్మార్గాలు...

కఠిన చట్టాల
వంట దారులారా
మహానుభావులారా...!

చట్టాలకు
మళ్ళీ మళ్ళీ పేర్లు
మార్చటమేనా...!

బడుగు
మహిళలకు
రక్షణ కల్పించే దిశగా
తక్షణ ఆలోచన ఇకనైనా చేస్తారా...?



**- ప్రసాద్ బాబు**
9704387870.

## అమ్మ చేతులైనా..

ఏ గమకం ఎక్కడ వేయాలో
ఏ అనుపల్లవెలా పలికించాలో
ఓ సంగీతపాఠం
కోయిలకెవరైనా బోధిస్తే
ఆ పాట పంచమం గడపదాటి
వసంతం అరుగుదాటి
ఎన్ని ఋతువులకు నేపథ్య గానమయ్యేదో!

ఏ వర్ణాన్ని ఎక్కడ అద్దాలో
ఏ రంగుల ఏయే పాళ్ల సమ్మిళితం
ఓ వర్ణనకందని రంగుకు పురుడోస్తుందో
కిరణానికెవరైనా నేర్పిస్తే
ఏడురంగు చారలే ఒళ్ళంతా పూసుకుని
మురిసిపోయే ఆకాశం
ఎన్ని అందమైన వానవిల్లులై నవ్వేదో!

మట్టే
రైతు పాదం కింద నలిగి బువ్వను పూస్తుంది
గడ్డిపూలే
తోటమాలి గడ్డపార చెక్కుళ్ళమధ్య
పూలవనాలై నవ్వుతాయి
గొంగళి పురుగే
రంగురంగుల రెక్కలేసుకుని
చూపులన్నీ మూటకట్టుకుంటుంది
రైతుపాదమో
గడ్డపార మొనదేలిన అంచో
రెక్క తొడిగేవేళ అయ్యే గాయమో
నవలోకపు నిచ్చెనలేగా!
నేనిలాగే ఉంటానంటే
బండరాయి గర్భగుడిని చేరుతుందా?
అమ్మ చేతులైనా...
జోకొట్టేవేళ
లేత బుగ్గల్ని తట్టాలికదా!



**- సాంబమూర్తి లండ**
9642732008

## కరోనా నానీలు

కానరాని
దేశం పోతివి
కరోనాను
వెంట తీసుకొస్తివి... !

వచ్చెను
కరోనా
తెచ్చెను
కన్నీటి "రోనా ".. !

ఏ జోన్లలో లేదు
కరోనాకు మందు
అన్ని జోన్లలో
లభించును మద్యం మందు.. !

కరోనా
కల్లోలం
జనమంతా
అల్లకల్లోలం... !



**-పి. కుమార్**
8978631913

## సూర్యమాల

తల్లి తండ్రి విడుచు తనయు లంత
కాటు వేయు నట్టి కాల యములు
భక్తి తోడ కొలువ ముక్తి కలుగు
పుండలీకు మాట పూలబాట

ఇంటి పనులు జేయు యాలి యంత
కట్ట లేము విలువ కాంత పనుల
కష్ట బెట్ట బోకు కలల నైన
పుండలీకు మాట పూలబాట

ఆడ బిడ్డ నంటు యాత్మ పంచు
వారు ఆస్తి లోన వాట నివ్వ
మనసు రాదు నిట్టి మమత నిజమ
పుండలీకు మాట పూలబాట

అన్న దమ్ము లనగ యాత్మ యొకటె
ఆలి వచ్చి నపుడు అంత రించు
లోక మంత తెలసు లోని గుట్టు
పుండలీకు మాట పూలబాట

ఆడ దంటె యబల యనగ రాదు
ఆది శక్తి యగును ఆడవాళ్లు
కన్న తల్లి అబల కాదు నెపుడు
పుండలీకు మాట పూలబాట



**...జాధవ్ పుండలిక్ రావు పాటిల్**
9441333315

## హృద్యమైన "గోకులం-కావ్యం"




చిక్కా శంకర్ రచించిన గోకులం కావ్యం చదువుతున్నంత సేపూ ఎంతో ఆసక్తికరంగా ఉంది. గోవు మన దైవం. గోవును ఒక దేవతగా, ఒక మాతగా మనం ఎందుకు కొలుస్తామో ఈ కవి కూలంకుషంగా తెలియజేసారు. తల్లులు లేని పిల్లలకు తల్లి గోవు అన్నారు. గోవు మనకు అనేక రకాలుగా ఉపయోగిస్తుంది. ఆ విషయం గమనించని అనేకమంది గోమాతను చంపి తినడం, ఎంతవరకు సబబు అనిపించేలా రచించిన ఈ కావ్యం ఎంతో హృద్యంగా సాగింది. ఈ గ్రంథంలో నేక పద్యాలున్నాయి. ఆటవెలది, తేటగీతి, సీస పద్యం, కందం అనేక చందస్సులలో సాగింది. "గోవు చుట్టు తిరిగి గోపూజ చేసిన / జన్మధన్యమగును జగతి యందు/ భూప్రదక్షిణంత పుణ్యంబు గలుగుచు/ అంతులేని సౌఖ్యమబ్బ గలదు" అంటారు. మరోచోట "యజ్ఞ యాగాలు చేసిన యశము కొరకు/ యేమి చేసిన గాని యీ భూమి పైన/ సాటి రాబోవు గోవుతో సమము గాను/ చేయు గో దాన మొక్కటే శ్రేష్ఠతమము" అంటారు. కవి చిక్కా శంకర్ పద్యాలు ఎంతో చిక్కగా ఉన్నాయి. వాటిలో కవిత్వం ఉంది. విషయాన్ని వివరించడమే కవిత్వం అని కాకుండా చక్కని విశ్లేషణను, పదునైన భాషను, పదజాలాన్ని వాడారు. ఉదాహరణకు "సొమ్ము కొరకు మమ్ములమ్ముచుంటిరి మీరు/ స్వార్థ మింత తగదు స్వాంత మందు/ ఎంత కష్ట మైన నిలలోన నోర్చుచు/ బ్రతుకు నిచ్చి నాము పరుల కొరకు" // "బ్రతికి నంత వరకు బానిసగా నుండి/ సేవ జేయ గలము శక్తి కొలది/ ప్రేమ తోడ మమ్ము పెంచి పోషించిన/ నీశ్వరుండు మెచ్చు నింపుమీద" వంటి అద్భుతమైన పద్యాలను రచించారు. గోమాతను పూజించితే కలిగే పుణ్యాలను వివరించేరు.

శ్రీ కృష్ణ పరమాత్మ ఆత్మ స్వరూపమైన గోమాతను మనం కాపాడటం మన విధి. గోవుకు దానం చేయడం, గోవుకు అన్నం తినిపించడం, గోదానం చేయడం వలన కలిగే సౌఖ్యాలు అనంతం. ఉదయమే లేవగానే గోవును చూస్తే కలిగే శుభ ఫలితాలు అనేకం. అటువంటి గోవుల గురించి వివరిస్తూ.."హిందువుల ధర్మ రక్షణ హితము గోరి/ భావితరముల బంగారు బాట వేసె/ కంకణము గట్టుకొని మమ్ము గాచినాడు/ పుణ్య చరితుడు కృష్ణుడు పూజ్యుడతడు"

"సంతను పశువుల నిలుపుచు/ వింతగ వేలము లు బెట్టి విత్తము కొర్కై / హంతకుల పాలు జేయుచు / పంతమ్మున నమ్ము కొనగ పాపము గాదె"

"గడ్డిని మేయుచు నిల మీ / బిడ్డలకే పాలనిత్తు ప్రీతిని గొలుపన్ / దొడ్డిన మము బంధించుచు / నడ్డి విరగ గొట్ట మీకు న్యాయంబగునా" అంటూ గోమాతకు జరిగే అన్యాయాలను కూడా ఏకరువు పెట్టిన తీరు చదువుతుంటే ఎంతో ఆవేదన కలుగుతుంది. చిక్కా శంకర్ ఇదివరలో అనేక పాటలు రచించినా, సత్యావతారుడు అనే కృతిని రచించారని తెలుస్తోంది. వాటిని చదవకున్నను ఇంత చక్కని గేయ కావ్యం రచించిన వీరికి ఆ గోమాత ఆశీస్సులు మెండుగా లభించాలని కోరుకుంటూ వీరికి నా మన:పూర్వక అభినందనలు..

ప్రతులకు: చిక్కా శంకర్
ఫోన్: 93984 93703

**-శైలజామిత్ర**
9290900879

## సాక్షాత్కరిస్తున్న స్వప్నం

పచ్చటి పైట కప్పుకొన్న పల్లెను
కండ్ల జూడంగనె కడుపు నిండుతాంది..
ఎండిన చెరువులకు జీవమొచ్చి..
ఆకలి, దూపలు పాపుతున్నయి..
తుమ్మలు మొలిశిన కాలువల్ల
నీళ్లు జలజలా ఉరుకుతున్నయ్..
నెర్రెలు పాశిన బీళ్లు
వరిసాల్లయి మురుస్తున్నవి..
వలసబోయిన ఊరు
మెల్లగా గూడు జేరుతున్నది..
కోటి ఎకరాల పచ్చటి కల
కాళేశ్వరమై సాక్షాత్కరిస్తున్నది..
గోదారి గలగలలు, కృష్ణమ్మ సందళ్ళు
ఎటు జూశినా వినబడుతున్నవి..

ఆకలికి తండ్లాడిన నేలల
అన్నపూర్ణమ్మ అలరారుతున్నది..
కరువు రాకాసి కోరలు సాచిన చోట..
కలిమి బలిమి విస్తరిస్తున్నది..
సంక్షుభితమై వగచిన ప్రజకు..
సంక్షేమ పథకమై అభయమిస్తున్నది..
అంధకారం అలమిన బతుకుల
వెలుగు రేఖలు ప్రసరిస్తున్నవి..
అవమానమై రాలిన చోటే..
స్వాభిమానమై నిలబడుతున్నది
ఎతేష్మమై నలిగిన భాషే..
క(వ)దన గానం ఆలాపిస్తున్నది
అస్తిత్వపు నినాదమే
ఆత్మగౌరవ కేతనమై
అంబరమంటుతున్నది..
సబ్బండజాతుల స్వప్నం
సత్యమై సాకారమవుతున్నది ..

అరవై ఏండ్ల పొద్దు..
ఆశాకిరణమై ఉదయిస్తోంది..
రేపటి వెలుగుల కాంతికై
కొత్త ఆశ చిగురిస్తోంది..



**-మధుకర్ రావు బోగెల్లి,**
9491318502
8522000157

## మనసు కోరుకునేది

గాయపడిన మనసు
గాయాన్ని
మర్చిపోలేక

నిజంలో బ్రతకలేక కొట్టుమిట్టాడుతూ
ఎపుడు పరధ్యానంలోనే
పాతజ్ఞాపకాలను మార్చిపోలేక
గాయపరిచిన వాళ్ళని క్షమించలేక మనోవేదనను
అనుభవిస్తూ

కొత్త ఆలోచనలకు తావివ్వలేక
మనుగడను ముందుకు సాధించలేక నలుగురితో కలవలేక
ఎవరితో పంచుకోలేక
గుండె భారంతో రోదిస్తూ

ఎవ్వరేమన్న తననే అన్నారని
తనకు ఎవరు లేరని
జీవితం యింతేనని
ఎవరితో కలవలేక
మనసును పంచుకోలేక
తన కన్నీటిని తెర చాటున దాచి పెడుతూ పెదవులపై
ధరహాసాన్ని చిందిస్తూ

జీవం వెల్లదీస్తూ బ్రతికున్న జీవచ్ఛవంలా మారిన
జీవితం...

మనసు కోరుకునేది నమ్మకం అది కోల్పోకుండా
చూసుకోవడం మనసున్న మనిషికే సాధ్యం..



**-అనిత దావత్**
9394221927

## కవిత్వం జ్ఞానం

వెలుగు దారి చూపుతూ
ఎలిగెత్తే బతుకులకై
ఎరుకతో ఉండేలా

అక్షరాల ఆటతో
సామాజిక చైతన్యబాట
పద విన్యాసం కవిత్వం

అశాంతి స్వల్పమైనా
అలలతో మొదలై
కెరటమై ఉప్పెనతో
శాంతి తీరాన్ని
ముంచేస్తుంది
అల్లకల్లోలం చేస్తుంది.
జ్ఞానంతో దృష్టి
సారిస్తే
తుఫాను ముడుచుకపోతుంది.
జ్ఞానం అనే ఎరుకతో
చీకటి మటుమాయం.



**- పత్తి శివప్రసాద్**
సెల్: 9440001224

## ఓం నమో భగవతే.. "రాఘవేంద్రాయ"

మనిషికి ఏ తత్త్వం అలవడినా లేకున్నా భక్తితత్త్వం అలవడటం తప్పనిసరి. భక్తి అంటే ఏదో జీవిత చరమాంకంలో ఏర్పడితే చాలు అనుకునేవారు ఎంతోమంది ఉన్నారు. కానీ భక్తి ఉంటే భయం ఉంటుంది. భయం ఉంటే మనం చేసే పనులలో ఏది తప్పు, ఏది ఒప్పు గ్రహించే శక్తి ఉంటుంది. పాపభీతి లేకుంటే ఏ పనైనా, ఎప్పుడైనా చేయచ్చు అనుకుంటారు. కానీ అది తప్పు. భగవన్నామస్మరణ లేనిదే మన జీవితమే లేదనే జ్ఞానము ఎప్పుడైతే అలవడుతుందో అప్పుడే మనిషి ఆలోచనలకు ఒక రూపం వస్తుంది. అలా కాకుండా మనిషి తనకు అన్నీ తెలుసును, తన ఎదుటివారికి మాత్రం ఏమీ తెలియదు అనుకుంటాడు. కానీ అలా అనుకోవడంలోనే తన అజ్ఞానముందని గుర్తించలేడు. ఇలాంటి సందిగ్ధ స్థితిలో నిత్యం కొట్టుమిట్టాడుతున్న సమాజంలో భక్తి పారవశ్యంతో రచయిత వెలుదండ సత్యనారాయణ గారి జీవితంలో శ్రీ రాఘవేంద్రస్వామి అనేక మహాత్మ్యాలు చూపాడు. కలలో కనిపించి అనేక సమస్యలకు దారి చూపాడని తెలిపారు. నమ్మకం ఉన్న చోట ఏదైనా జరగచ్చు అనేది నిరూపించిన గ్రంథం ఇది.






రచయిత సత్యనారాయణ జీవితంలో జరిగిన సంఘటలను చదువుతుంటే చాలా ఆశ్చర్యం కలిగింది. ఎంత భక్తి ఉన్నా ఎవరికీ ఇంతటి భాగ్యం లభించదు. పూర్వజన్మ సుకృతం ఉంటేనే ఇలాంటివి సాధ్యం అవుతాయి. పూర్వీకుల ఆస్తికి సంబంధించిన పత్రాలు కనిపించకపోతే రాత్రి కలలో ఎవరో కనిపించి ఆ పత్రాలు ఫలానా పెట్టెలో ఉన్నాయని తెలిపారట. అక్కర్లేని సామాన్లవద్దనున్న ఆ పెట్టెలో తనకు కావాల్సిన పత్రాలు దొరకడం, ఆస్తి రావడం అంతా ఆ రాఘవేంద్రులవారి దయ అని నమ్ముతారు. అలిగి వెళ్ళి తుంగభద్రకు వెళ్ళే మార్గం దగ్గర వీరి భార్య ప్రసాదం దొరకలేదని కూర్చుందట. అంతలో ఒక పండుముసలి అతను వచ్చి ప్రసాదం దొరకలేదని అలిగితే ఎలా? రా నేను ఇప్పిస్తాను అని ఇప్పించటం, పక్కకు తిరిగి చూస్తే ఎవరూ కనిపించకపోవడం కూడా ఆ రాఘవేంద్రుల మహిమ అంటారు. ఒకనాడు మంత్రాలయం వెళ్ళి స్వామివారిని దర్శించుకోవాలనుకుంటే వీరి కుమారునికి జ్వరంగా ఉండటంతో వీరిరువురు మాత్రం దర్శనానికి వెళ్ళారట. అంతలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు వచ్చి పసివాడిని అలా వదిలి ఎలా వస్తారు? పిల్లవాడు ఏడుస్తున్నాడు అని చెప్పడంతో వీరు పరుగులు తీసి చూస్తే ఆ పిల్లవాడు ఏకంగా ఉయ్యాలనుంచి తలను కిందికి వేసి ఏడుస్తుండటం, కాస్సేపు ఆగితే ఆ తల కిందికి పడితే ఏమయినా అయ్యివుండేది. వీరిని ఆ రాఘవేంద్రులవారే రక్షించారని నమ్ముతున్నారు. ఇలాంటివి ఎన్నో సంఘటలను దృష్టిలో ఉంచుకుని ఏకంగా శ్రీ రాఘవేంద్రుల వారిపైనే కావ్యం రచించేలా చేసాయని తెలుపుకుంటారు. ఇది భక్తి కావ్యం. కవి తన భక్తిని విభక్తి ప్రత్యయాలతో కూర్చి ఆ పరమ పురుషుని స్తుతించే కావ్యం ఇది. భక్తి కావ్యం రచించడం అనేది ఒక మహాయజ్ఞం. ఇటువంటి మహాయజ్ఞాన్ని సంపూర్ణంగా మలచి పదిమందికి అందిచేసిన వెలుదండ సత్యనారాయణ గారికి నా నమస్సులు.

ప్రతులకు: శ్రీమతి నగజాత
"శ్రీనివాసము",ఇ.నెం. 10-4-218
రోడ్ నెం. 3, విజయపురి కాలనీ
లింగోజిగూడ, హైదరాబాద్-35.
సెల్: 9441162863
7729087540



**-శైలజామిత్ర**
9290900879

## నేటి నిజాలు



# నాటి సభలు, సమావేశాలు...
జులై 2 నుండి జులై 8 వరకు

జులై 2

జ్ఞాపకాలు




జులై 2, 2018న కళాలలిత కళా వేదికలో ప్రముఖ సాహితీవేత్త శ్రీ బలివాడ కాంతారావుగారి జయంతి సభలో పాల్గొన్న గాయని రేవతి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, కళా జనార్థనమూర్తి, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, ఎం.వి. రాఘవాచారి, బాపిరాజు తదితరులు.



2020లో రవీంద్రభారతిలో జరిగిన ఒక సభలో సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డా॥ నందిని సిధారెడ్డి, డా॥ వద్దేపల్లి కృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి. రమణాచారి, బైస దేవదాసు.

జులై 3

జ్ఞాపకాలు



జులై 3,1993న ఢిల్లీలో ప్రధానమంత్రి పీ.వీ. నరసింహారావుగారిని కలిసిన రాష్ట్ర చిన్న దినపత్రికల సంఘం బృందం



జులై 4

జ్ఞాపకాలు



జులై 4, 2019న త్యాగరాయ గానసభలో ప్రముఖ సాహితీవేత్త నేదునూరి గంగాధరం జయంతి సభలో ప్రసంగిస్తున్న ఏ.పి. సాహిత్య అకాడమీ ఛైర్మన్ ఆచార్య కొలకలూరి ఇనాక్, ఆనంద్‌రెడ్డి, కళా వి.యస్. జనార్థనమూర్తి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.



పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను సత్కరిస్తున్న కళా జనార్థనమూర్తి. వేదికపై బైస దేవదాసు, ఆనంద్‌రెడ్డి

జులై 4

జ్ఞాపకాలు



జులై 4, 2015 ఎన్.బి.టి. కార్యాలయంలో స్వర్ణలతా నాయుడు రచించిన "జ్వలించిన రాగాలు", "పూలపిట్ట" గ్రంథాల ఆవిష్కరణ సభలో డా॥పోరెడ్డి రంగయ్య, పి. సుబ్బారావు, వడలి రాధాకృష్ణ, ఆవిష్కర్త నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, స్వర్ణలతా నాయుడు, డా॥పత్తిపాక మోహన్, ఆర్.వి.ఎస్.ఎస్. శ్రీనివాస్.



కవయిత్రి స్వర్ణలతా నాయుడును సత్కరిస్తున్న అతిథులు.

జులై 5

జ్ఞాపకాలు



జులై 5, 2019న త్యాగరాయ గానసభలో మాయకుంట్ల నారాయణరెడ్డి "నానీల పయనం" గ్రంథావిష్కరణలో డా॥ పత్తిపాక మోహన్, రమణ వెలమకన్ని, మాయకుంట్ల నారాయణరెడ్డి దంపతులు, ఆవిష్కర్త డా॥ఎన్.గోపి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ఆర్.సీతారామరాజు, డా॥ పోరెడ్డి రంగయ్య.




'నానీల పయనం' కవి మాయకుంట్ల నారాయణరెడ్డి దంపతులను సత్కరిస్తున్న అతిథులు పత్తిపాక మోహన్, రమణ వెలమకన్ని, డా॥ఎన్.గోపి, బైస దేవదాసు,ఆర్.సీతారామరాజు.

జులై 6

జ్ఞాపకాలు



జులై 6, 2015న త్యాగరాయ గాన సభలో జరిగిన సభలో డా॥సినారె గారితో శ్రీమతి బైస వీణ, కళా జనార్ధనమూర్తి, శ్రీమతి భాను, బైస దేవదాసు, ఎల్వీ సుబ్రహ్మణ్యం.



జులై 7, 2018న 6-7-2018 నుండి 12-7-2018 వరకు జరిగిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం (80వ పుట్టినరోజు సందర్భంగా జరిగిన సభలో పాల్గొన్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, కళాజనార్ధనమూర్తి, జూలూరి గౌరీశంకర్, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఎం.ఎల్.సి. ఏపి శాసనమండలి చీఫ్‌విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్, డా॥ పసునూరి రవీందర్, వకుళా భరణం కృష్ణమోహన్.

జులై 7

జ్ఞాపకాలు



జులై 7, 2017న "గురువు" అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, కవయిత్రులతో అతిథులు శ్రీ చరణ్, చిక్కా రామదాసు, కళా జనార్ధనమూర్తి, యం.కె.రాము, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ హనుమంత రామశర్మ, చిక్కా దేవదాసు, ఎన్వీ రఘువీర్ ప్రతాప్, యం. రత్నాకర శర్మ.




సభలో ప్రసంగిస్తున్న బైస దేవదాసు.

జులై 8

జ్ఞాపకాలు



జులై 8, 2015న ఎర్రగడ్డలోని రాయల్ హాల్‌లో 10 మంది కవుల 'రెక్కల ప్రస్థానం' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో పెద్దూరి వెంకటదాసు, ఇసనాక మురళీధర్, హస్మంతరావు, గూడూరు చెన్నారెడ్డి, ఆవిష్కర్త నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ తిరునగరి, యం.కె.సుగమ్‌బాబు, మల్లాది విజయలక్ష్మి, గూడూరు విజయలక్ష్మి.



సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

## 12వ జాతీయస్థాయి 'సోమేపల్లి' చిన్న కథల పోటీ విజేతలు

'రమ్యభారతి' ఆధ్వర్యంలో ఇటీవల జాతీయస్థాయిలో నిర్వహించిన తెలుగు చిన్న కథల పోటీలలో 12వ 'సోమేపల్లి సాహితీ పురస్కారాల' కోసం దేశం నలుమూలల నుండి 121 కథలు పరిశీలనార్థం వచ్చాయి. వాటిలో ఉత్తమంగా ఉన్న ఈ క్రింది కథలను న్యాయనిర్ణేత ఎన్నిక చేసారు.

విజేతలు: నూజివీడుకు చెందిన డా॥ జడా సుబ్బారావు రచించిన 'మంచుకింద ఉక్కపోత' కథకు 'సోమేపల్లి' ప్రథమస్థాయి అత్యుత్తమ పురస్కారం లభించింది. ద్వితీయస్థాయి పురస్కారం విశాఖపట్నంకు చెందిన శ్రీమతి పి.వి.శేషారత్నం రచించిన 'ఇదేం న్యాయం?'కు, తృతీయస్థాయి పురస్కారం నర్సారావుపేటకు చెందిన నారాయణ గూండ్ల రచించిన 'గిరిగీరోల్లు'కు లభించాయి.

అలాగే 'బుడగ' రచనకు బి.వి.శివప్రసాద్(విజయవాడ), 'గీతా మకరందం' రచనకు జి.రంగబాబు (అనకాపల్లి), 'స్మార్ట్‌ఫోన్' రచనకు శింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు), 'క్రమ వికాసం' రచనకు కృపాకర్ పోతుల (హైదరాబాద్)లకు ప్రోత్సాహక పురస్కారాలు లభించాయి.

విజేతలకు వరసగా 2,500, 1,500, 1,000, ప్రోత్సాహకం 500 నగదుతోపాటు జ్ఞాపిక, శాలువతో త్వరలో జరిగే ప్రత్యేక సభలో సత్కరించడం జరుగుతుంది. ఈ పోటీలకు ప్రఖ్యాత రచయిత, విమర్శకులు శ్రీకంఠస్ఫూర్తి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీలు విజయవంతం చేసిన రచయితలకు, పత్రికల వారికి ఈ సందర్భంగా రమ్యభారతి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నది.

-ఇట్లు

-సోమేపల్లి వెంకటసుబ్బయ్య
అవార్డు కమిటీ ఛైర్మన్

-చలపాక ప్రకాష్
ఎడిటర్, రమ్యభారతి

## వాసాఫౌండేషన్ సాహితీకిరణం సంయుక్త నిర్వహణలో డా॥ వాసాప్రభావతి స్మారక కథలపోటీ

అంశము: 'సమాజంలో ప్రస్తుత స్త్రీ సమస్యలు-పరిష్కారాలు'

నియమ నిబంధనలు: కథ రాత ప్రతిలో ఎ4 సైజులో 4పేజీలు, డి.టి.పి. అయితే 3 పేజీలకు మించరాదు, కాగితంపై ఒకవైపు మాత్రమే రాయాలి, ఒక్కొక్కరు ఒక కథను మాత్రమే పంపాలి. ఇంతకుముందెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదనీ, మరెక్కడా పరిశీలనలో లేదని తెలియజేసే హామీపత్రం తప్పనిసరి. రచయిత వివరాలు హామీపత్రంపైనేవుండాలి. కథవున్న పేపర్‌పై రచయిత వివరాలు ఉండరాదు. ఎంపిక కాని కథలు తిరిగి పంపబడవు, న్యాయనిర్ణేతలదే తుదినిర్ణయం. కథనుపంపే కవరుపై డా॥వాసా ప్రభావతి స్మారక కథలపోటీకి అని స్పష్టంగా రాయాలి. బహుమతుల వివరాలు: ప్రథమ బహుమతి రూ॥5000/-, ద్వితీయ బహుమతి రూ॥2500/-, 5 ప్రత్యేక బహుమతులు, రూ॥1000/- చొప్పున 5 కథలకు. విజేతలు మెమెంటో, ప్రశంసాపత్రంతో సత్కరించబడతారు. వారు హైదరాబాద్‌లో నిర్వహించబోయే కార్యక్రమానికి విచ్చేసి బహుమతులు స్వీకరించాలి. కథలు చేరవలసిన ఆఖరుతేది. 30.09.2020. పంపవలసిన చిరునామా: సాహితీకిరణం, ఇం.నెం. 11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3, హైదరాబాద్- 500102.సెల్:040-29550181 email: sahithikiranam@gmail.com

ప్రకాష్ వాసా
వ్యవస్థాపకుడు-వాసా ఫౌండేషన్

## బెంగళూరులో వ్యభిచార గృహంపై దాడి

బెంగళూరు,జూలై8(ఆర్ఎన్ఎ): బెంగళూరులో వ్యభిచార ముఠా గుట్టు రట్టయ్యింది. నగరంలోని యశ్వంత్‌పూర్ ఏరియాలోగల ఓ గెస్ట్‌హౌస్‌లో వ్యభిచారం జరుగుతున్నదన్న సమాచారం అందుకున్న సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) పోలీసులు.. ఆ గెస్ట్‌హౌస్‌పై దాడి చేశారు. వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి చెరలో ఉన్న ఐదుగురు యువతులను రక్షించి రెస్క్యూ హోమ్‌కు తరలించారు. బెంగళూరు క్రైమ్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సందీప్ పాటిల్ రైడింగ్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు


ప్రసిద్ధ కవి "పాటవెలదుల' సృష్టికర్త
డా॥ వద్దెపల్లి కృష్ణ
మరియు
నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో



### ప్రతినెలా ఉత్తమ "పాట వెలదుల"కు బహుమతులు

ప్రతినెలా ఉత్తమ పాట వెలుదల్ని రచించిన రచయితలకు
ప్రథమ బహుమతి1,116/-,
ద్వితీయ బహుమతి750/-,
తృతీయ బహుమతి 500/-లతో పాటు
ప్రశంసాపత్రం అందజేయబడును.

'పాట తవెలదుల'లక్షణం: ప్రతిపాదంలో 4 పాదాల్లోనూ 5 సూర్యగణాలు హంస పంచకం ఉండాలి.

అంటే "ఆటవెలది"లో 2వ, 4వ పాదంలో పాటించే హంస పంచకాన్ని అన్నిపాదాల్లో పాటించాలి.

5 సూర్యగణాల మాత్రలనిడివి15 మాత్రలు. మాత్రాగణనం 'పాట' లక్షణం.

హంస పంచకం 'ఆటవెలది'లక్షణం.
ఈ వినూత్న పద్య ప్రయోగానికి "పాటవెలది" అని పేరుపెట్టనైనది.

'పాట వెలది' పద్య ఉదాహరణకు:
"పల్లెలందు వీచు పైరగాలి
పట్నమందు లేచు పాడుగాలి
ప్రియముగాను మనిషి పీల్చుగాలి
కలుషితమ్ము ఆమె కర్మగాలి"

ఇలా కనీసం 5 పద్యాల్ని రచించి 'నేటినిజం' పత్రికకు ప్రతినెలా 20వ తేదీలోగా పంపించాలి. ప్రతినెల నెలాఖరులో ఫలితాల్ని ప్రకటించి రచయితలకు బహుమతుల్ని నేటినిజం వేదికగా అందజేయడం జరుగుతుంది.

సందేహాలకు డా॥ వద్దేపల్లి గారిని 9246541699లో సంప్రదించండి.
రచనలు పంపవలసిన ఈమెయిల్:

E-mail : netinizam2020@gmail.com


## సచివాలయమంటే పాలనకు గుండెకాయలాంటిది !

హైదరాబాద్, జులై 8సచివాలయం అంటే పరిపాలనకు గుండెకాయలాంటిది. అక్కడి నుంచే ముఖ్యమంత్రి, మంత్రులు పాలన చేయాలి. వారికి అందుబాటులోనే అధికారుల కార్యాలయాలు ఉండాలి. అపుడే పాలన సజావుగా సాగుతుంది. అలాగే కార్యాలయాలనేవి ప్రశాంతం వాతావరణానికి కేంద్రంగా ఉండాలి. ఓ కార్పోరేట్ ఆఫీస్‌కు వెళితే ఎంత కుదురుగా ఉంటుందో సచివాలయం కూడా అంతే కుదురుగా ఉండాలి. మంత్రి ఒక దగ్గర..ఆయన అధికారులు మరో దగ్గర..కార్యాలయాలు ఇంకో దగ్గర ఇలా విసిరేసినట్లు ఉండరాదు. కానీఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయం అన్నది ఓ పద్దతి లేకుండా నిర్మించారు. అడపాదడపా మధ్య మధ్యలో నిర్మాణాలు చేపట్టడం..అక్కడో భవనం ఇక్కడో భవనం అన్నట్లుగా విసిరేసినట్లు ఉండేది. ఇంతచేసినా ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ ఒకచోట ఉండేవి కాదు. సచివాలయంలో పనుల కోసం వచ్చిన వారు మళ్లీ ఏ విద్యా శాఖకో లేదా ఇతర శాఖల అధికారుల కోసమో సచివాలయం దాటి పోవాల్సి వచ్చేది. ఇవన్నీ ప్రతి ఒక్కరికి అనుభవాలే. సచివాలయంలో అన్నింటికి మించి చక్కటి వాతావరణం ఉండేది కాదు. నిజాం కాలంలో నిర్మించిన సచివాలయం వేరు.. ఆ తరవాత వచ్చిన అనేకానేక కట్టడాలు వేరు. వాటి రిపేర్లకే ఏటా కోట్లు తగులబెట్టేవారు. కొందరు కాంట్రాక్టర్లు నిత్యం ఈ పనుల్లోనే ఉండేవారు. అన్నింటికి మించి తగిన పార్కింగ్ ఏర్పాట్లు లేవు. రక్షణ వ్యవస్థ అస్సలు సరిగా లేదు. సిఎం కార్యాలయంలో అగ్నిప్రమాదం లాంటిది జరిగితే ఇక అంతే సంగతులు. అలాంటి సచివాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయా ముఖ్యమంత్రులు కోట్లు వెచ్చించి చాంబర్లు బాగుచేయించుకుని ప్రజాధనం వృధా చేశారు. కొత్తగా బిల్డింగ్‌లు కట్టి కోట్లు మింగేశారు. ఇవన్నీ కాదనలేని నిజాలు. రిపేర్లు, సున్నాలు వేయడం. లీకేజీలు అరికట్టడం, విద్యుత్ లైన్లు మార్చడం..ఇతర మెయింటెన్స్‌ల లెక్కలు తీస్తే వందల కోట్లు వృధా చేసి ఉంటారు. నగరం నడిబొడ్డున విశాలమైన స్థలలో సచివాలయం ఉన్నా ఓ పద్ధతి లేకుండా ఉన్నదన్నది ఎవరైనా అంగీకరించాల్సిందే. అలాంటి సచివాలయాన్ని మార్చి, అన్ని హంగులతో..అధునాతన పద్దతులతో నిర్మించాలన్న సంకల్పం సిఎం కెసిఆర్ తలపెట్టి ఏళ్లు అవుతోంది. తెలంగాణ ఆవిర్భావ తొలిదశల్లోనే ఆయన ఈ ప్రకటన చేశారు. ఉన్న భవనాన్ని కూల్చకుండా కొత్తగా స్థలం కోసం అన్వేషించారు. పరేడ్ గ్రౌండ్స్ వద్ద ఉన్న బైసన్ పోలో జాగాను ఇవ్వాల్సిందిగా కేంద్రం చుట్టూ తిరిగితిరిగి వేసారారు. అయినా కేంద్రం నాన్చిందే తప్ప సమాధానం ఇవ్వలేదు. ఈ దశలో గతేడాది సిఎం కెసిఆర్ ఓ ధృడ నిర్ణయం తీసుకుని పాత సచివాలయాన్ని పూర్తిగా తొలగించి కొత్తగా అధునాత సచివాలయనిర్మాణం కోసం సిద్దమయ్యారు. శంకుస్థాపన చేశారు. అయితే పలువురు కోర్టుల్లో కేసుల వేసి అడ్డుకున్నా చివరకు హైకోర్టు ప్రభుత్వ సంకాల్పన్ని బలపర్చి కేసులను కొట్టేయడంతో అనుకున్న మేరకు అధునాతన సచివాలయానికి బీజం పడింది. ప్రస్తుతం పాత సచివాలయ భవనాన్ని కూల్చేసి దాని స్థానంలోనే అన్ని హంగులతో సమీకృత నూతన సచివాలయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. శ్రావణ శుద్ధ పంచమి అంటే జులై 25 లేదా రాఖీ పౌర్ణమి అంటే ఆగస్టు 3న కొత్త సెక్రెటేరియట్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లుగా విశ్వసనీయ వర్గాల సమాచారం. కొత్త భవన నిర్మాణాన్ని ఏడాది నుంచి ఏడాదిన్నర పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పిస్తోంది. ఆరు లక్షల చదరపు అడుగుల్లో నూతన సచివాలయం నిర్మాణం జరగనుంది. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల సమావేశాలకు కోసం అధునాతన హాల్స్ దీనికోసం నిర్మించనున్నారు. మంత్రుల పేషీల్లోనే ఆయా శాఖల కార్యదర్శులు, సెక్షన్ ఆఫీసులను ఏర్పాటు చేయబోతున్నారు. ఇవన్నీ ఒకేచోటకు రానున్నాయి. ఇప్పటికే నగరంలో పలుచోట్ల విసిరేసినట్లుగా ఉన్న అనేక కార్యాలయాలు ఇక సచివాలయంలో శాశ్వతంగా ఉండిపోనున్నాయి. పలుచోట్ల లక్షల్లో అద్దె చెల్లిస్తూ అనేక కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. కొత్త సచివాలయం రాకతో ఈ బెడదా తప్పనుంది. సచివాలయంలోకి ప్రేశిస్తే అన్ని పనులను చక్కబెట్టుకుని వచ్చేలా అన్ని శాఖలు ఇక్కడే కొలువు దీరనున్నాయి. ఇప్పటి వరకు ప్రస్తుత సచివాలయంలో అనేక శాఖలు బయట ఉండడం వల్ల అధికారులను ఏదైనా సమావేశానికి ముఖ్యమంత్రి లేదా మంత్రి పిలిస్తే ఆ రోజంతా సమయం వృధా అయ్యేది. కార్యాలయానికి వెళ్లిన ప్రజలకు అధికారి లేకపోవడంతో ఆ రోజంతా పడిగాపులు పడాల్సి వచ్చేది. ఇకపోతే సమీకృత భవనం కనుక ప్రభుత్వం కూడా ముందుముందు మరిన్ని శాఖలకు లేదా కొత్తగా ఏర్పడే శాఖలకు అవసరమైన కార్యాలయాలకు అనువుగా కొత్త సచివాలయం నిర్మించాలి. రానున్న కాలంలో మరింతగా కార్యాలయ అవసరాలు పెరగనున్నాయి. అలాంటి అవసరాలను మరో వందేళ్లయినా తీర్చేలా ప్రస్తుత డిజైన్లనలు పరిశీలించుకోవాలి. నూతన సచివాలయ భవన నిర్మాణ కోసం10 కంపెనీలు నమూనాలను, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను ప్రభుత్వానికి సమర్పించాయని తెలుస్తోంది. ఈ సమయంలో సచివాలయం బయట ఉంటున్న వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, సిబ్బందిని లెక్కలోకి తీసుకుని మరింత జాగ్రత్తగా ప్లాన్ రూపొందించాలి. అన్ని ఆధునిక హంగులతో నిర్మించబోయే కొత్త సచివాలయం కాబట్టి భవిష్యత్‌లో ఎలాంటి అవాంతరాలు రాకుండా చూసుకోవాలి. అవసరమైతే గతంలో పనిచేసిన విశ్రాంత ఐఎఎస్‌ల సూచనలు,సలహాలు కూడా స్వీకరించడంలో తప్పు లేదు. కొత్త భవన ముఖ ద్వారం తూర్పు వైపుగా ఉండి, ముఖ్యమంత్రి కోసం ప్రత్యేక ప్రవేశ ద్వారం ఉండేలా ఈ నిర్మాణం జరగనుంది. భవనం మధ్యలో చెట్లు, పచ్చికబయళ్లతో కూడిన రెండు పెద్ద వరండాలు లోపల వెలువడే కర్బన వ్యర్థాలను తగ్గించే విధంగా ఉంటాయి. హుస్సేన్‌సాగర్ మీదుగా వీచే గాలులు లోపలికి ప్రవేశించి భవనం ఎల్లప్పుడూ చల్లగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగా డిజైన్లు రూపొందించారు. మరో పదేళ్లయినా ప్రస్తుతం ఉన్న పాత సచివాలయాన్ని తొలగించాల్సిందే. ఆ పనేదో ఇప్పుడే చేయడం స్వాగతించాల్సిందే. దీనిపై విమర్శల కన్నా సూచనలు చేస్తే మరీమంచిది. పాత సచివాలయాన్ని కూల్చడంతో కాలగర్భంలో పాలనా భవనాలు అంటూ వ్యాఖ్యానాలు చేయడం సరికాదు. మహామహులు,,మహానగరాలే కాలగర్భంలో కలసి పోతుంటే, ఓ పురాతన కట్టడం తొలగించడం కాలగర్భంలో కలసిపోవడం ఎలా అవుతుందో అర్థం కాని ప్రశ్న.మొత్తంగా సిఎం కెసిఆర్ సంకల్పబలంతో అదునాతన సచివాలయం మరో ఏడాదిలో ఆవిష్కృతం కానుంది. అందుకు తెలంగాణకు గుండెకాయలాంటి అధునాతన సచివాలయం ఆవిష్కృతం కానుంది.

## గుజరాత్‌లో ఆగని వరదలు

### తడిసి ముద్దవుతున్న పలు గ్రామాలు

గాంధీనగర్,జూలై8(ఆర్ఎన్ఎ): వరుస వర్షాలతో గుజరాత్‌లోని కొన్ని జిల్లాలు తడిసి ముద్దవుతున్నాయి. గత మూడు రోజుల నుంచి భారీగా వర్షాలు కురుస్తుండడంతో ఇప్పటికే పలు జిల్లాలు నీటమునిగాయి. రోడ్లపైన భారీగా వరద నిలువడంతో చాలా చోట్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జనం ఇండ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ సిబ్బంది రెండు రోజుల నుంచి సహాయక చర్యలు చేపడుతున్నా రోడ్లపై నీళ్లు పోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వర్షాలు తగ్గితే కాని పరిస్థితి కుదుటపడకపోవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ద్వారకా నగరంలో కురిసిన వర్షాలతో వరద రోడ్లపైకి చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుజరాత్‌లో మంగళవారం వరుసగా మూడో రోజు కూడా భారీ వర్షాలు కురవడంతో గత రెండు రోజుల్లో సౌరాష్ట్రలోని లోతట్టు ప్రాంతాల నుంచి సుమారు 1,000 మందికి పైగా ఇతర ప్రదేశాలకు తరలి వెళ్లినట్లు సమాచారం. అదే విధంగా బుధవారం కూడా కచ్ ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో అక్కడి రోడ్లన్నీ వరదతో నిండిపోయాయి.

## జార్ఖండ్‌లో మంత్రి, ఎమ్మెల్యేకు కరోనా

### ఆందోళనలో అధికారులు

రాంచి,జూలై8(ఆర్ఎన్ఎ): జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ మంత్రిమండలి సహచరునికి కరోనా పాజిటివ్ అని తేలింది. దీంతో ఆయన కార్యాలయంలో అధికారులు భయాందోళనలకు గురవుతున్నారు.

జేఎంఎం పార్టీకి చెందిన ఆ మంత్రికి మంగళవారం సాయంత్రం కరోనా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆయనను రాత్రి పొద్దుపోయిన తర్వాత రాంచీలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. అంతకుముందు అదే పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యారు. దీంతో 53 ఏండ్ల ఆ ఎమ్మెల్యేకు ధన్‌బాద్‌లోని బీసీసీఎల్ దవాఖానలో చికిత్స అందిస్తున్నారు.

కాగా, ఈ ఇద్దరు కరోనా బాధితులు నాలుగు రోజుల క్రితం ముఖ్యమంత్రిని కలిశారు.

దీంతో ముఖ్యమంత్రి కార్యాలయానికి చెందిన అధికారులు భయపడుతున్నారు. అదేవిధంగా ఆ ఎమ్మెల్యే సోమవారం సాయంత్రం సింద్రీలో జరిగిన ఓ ఫంక్షన్‌లో పాల్గొన్నారు. ఆ కార్యక్రమాని 150 మంది పాల్గొన్నారు. జార్ఖండ్‌లో ఇప్పటివరకు 3000 కరోనా కేసులు నమోదయ్యాయి. మంగళవారం కొత్తగా 149 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

## రైతు సంక్షేమం లక్ష్యంగా సిఎం కెసిఆర్ కృషి

### రైతువేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పువ్వాడ

ఖమ్మం,జూలై8(ఆర్ఎన్ఎ): రైతు సంక్షేమమే లక్ష్యంగా సిఎం కెసిఆర్ అనేక కార్యక్రమాలు చేపడు తున్నారని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రైతుల కోసం ఇంత గొప్ప కార్యక్రమాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా చేపట్టలేదన్నారు. జిల్లాలోని రఘునాధపాలెం మండలం పాపటపల్లి, బుడిదెంపాడు గ్రామంలో నిర్మించనున్న రైతు వేదిక నిర్మాణ పనులకు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆరో విడుత హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా వేదిక నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు అదేశించారు. రైతులకు తోడ్పాటు అందించడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని అన్నారు. పంటల పెట్టుబడి సమయంలో రైతుబంధు పంపిణీ చేయడం రైతులకు ఎంతో చేయూతని చ్చినట్లు అవుతుందని అన్నారు. నాటిన ప్రతి మొక్క జీవం పోసుకునేలా బాధ్యతతో సంరక్షించాలని మంత్రి పిలుపునిచ్చారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రజలతో కలిసి మొక్కలు నాటి ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత గ్రామస్తులదేనని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ , జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, డీసీసీబీ ఛైర్మన్ కురాకుల నాగభూషణం, జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## డెక్కన్ కాకతీయ శైలిలో సమీకృత సచివాలయం

### -తెలంగాణకు మకుటాయ మానం కానున్న కొత్త భవనం

హైదరాబాద్,జూలై8(ఆర్ఎన్ఎ): అధునాతనంగా నిర్మించబోయే సచివాలయం హైదరాబాద్‌కే కాకుండా, మొత్తం తెలంగాణకే మకుటాయమానంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. దీనిని అత్యంత శ్రద్దతో అధునాత డిజైన్లతో రూపిందిస్తున్న తీరు చూస్తుంటే తెలంగాణలో మరో అద్భుత కట్టడం ఆవిష్కృతం కానుందని తెలుసుకోవచ్చు. దక్షిణభారతీయ సంప్రదాయంలో డెక్కన్ కాకతీయ శైలిలో సమీకృత సచివాలయ భవన నిర్మాణం తెలంగాణకు తలమానికంగా నిలవనుందని అధికారులు పేర్కొంటున్నారు. మనోహరమైన కాకతీయుల నిర్మాణశైలిలో విలక్షణ స్మారక చిహ్నంగా సమీకృత సచివాలయం నిర్మాణం జరగనున్నట్టుగా సమాచారం. రాజప్రసాదంలా కొత్త సచివాలయ భవన నమూనాను తీర్చారు.

ఊహించుకుంటేనే కలల సౌధం కళ్ల ముందు సాక్షాత్కారం అవుతోంది. కొత్త సెక్రటేరియట్ రూఫ్‌టాప్‌పై, పార్కింగ్ రూఫ్‌టాప్‌లపై సోలార్ ప్యానళ్ల అమరికతో సౌర విద్యుత్ వాడుకునేలా నిర్మాణం జరుగనుంది. భవనం మొత్తం ధారాళంగా ఉండేలా గాలి ప్రసరించి సహజమైన చల్లదనం ఉండేలా, లోపల ఉండే భారీ వరండాల్లో స్వచ్ఛమైన గాలి పీల్చేందుకు దోహదపడేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయం పార్కింగ్‌లో 500ల కార్లు, విజిటర్స్ పార్కింగ్‌లో 300ల కార్లు పార్కింగ్ చేసేలా వెసులుబాటు కల్పిస్తూ కొత్త సచివాలయ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. గుడి, బడి, బ్యాంకు, ఏటిఎంలు, క్యాంటీన్ల ఏర్పాటుకు సరిపోయే స్థలాన్ని సైతం ఈ నిర్మాణంలో కేటాయించనుంది. స్మార్ట్ లైటింగ్ కంట్రోళ్లు, మోషన్ సెన్సార్లు, ఆటోమెటిక్ స్విచ్చులు, టైమర్లు, డిమ్మింగ్ కంట్రోళ్లు లాంటి హంగులన్నింటిని ఏర్పాటు చేస్తారు. ప్రస్తుత స్థలంలో

60 శాతం స్థలం అందమైన పచ్చికబయళ్లతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరిచేలా ఉంటుంది. ఫ్రాన్స్‌లోని ప్యాలెస్ ఆఫ్ వర్సెల్స్ స్ఫూర్తిగా పచ్చికబయళ్ల భవనానికి ఈశాన్యం, ఆగ్నేయం మూలాల్లో ఉండేలా నిర్మాణం జరుగుతుంది. రెండు ల్యాండ్‌స్కేప్‌ల్లో రెయిన్‌వాటర్ హార్వెస్టర్లతో పాటు మధ్యలో తెలంగాణ అధికారిక పువ్వు తంగేడు ఆకారంలో వాటర్ ఫౌంటెన్లను ఏర్పాటు చేయనున్నారు. కృత్రిమ విద్యుత్ అవసరం లేకుండానే సహజమైన వెలుతురుపడేలా ఈ నిర్మాణం జరుగుతోంది. భవనం మొత్తం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ బిల్డింగ్‌కాన్సెప్ట్‌లో నిర్మితమవుతోంది. సెక్రటేరియట్ రూఫ్‌టాప్‌పై, పార్కింగ్ రూఫ్‌టాప్‌లపై సోలార్ ప్యానళ్ల అమరిక కారణంగా విద్యుత్ కర్చు కూడా ఆదా కానుంది.

సమీకృత కొత్త సచివాలయం కోసంమొత్తం 10 డిజైన్లకు గాను మూడింటిని ఆర్‌అండ్‌బి శాఖ మూడు డిజైన్లను సిఎంకు పంపించగా అందులోంచి ఒక డిజైన్‌ను సిఎం ఎంపిక చేసినట్టుగా తెలిసింది. ఇక కొత్త నిర్మాణంలోని ఫీచర్స్‌ను చూస్తే ఇది పూర్తి వాస్తు ప్రకారం రూపొందించిన డిజైన్. కొత్త సచివాలయ భవన నమూనా చారిత్రక కట్టడాన్ని పోలి ఉంది. చూడడానికి రాజప్రసాదంలా ఉన్న ఈ నమూనా అందరినీ ఆకట్టుకునేలా ఉంది. భవనం ముందున్న నీటి కొలనులో ఈ భవనం ప్రతిబింబిస్తోంది. ఆరు అంతస్తుల్లో సచివాలయ భవన నిర్మాణం చేపట్టనున్నారు. అత్యాధునిక టెక్నాలజీ, పర్యావరణహిత భవన దీని నిర్మాణం జరగనుంది. మొత్తంగా ఇది ఓ అద్భుత కట్టడంగా నిలిచి పోతుందనడంలో సందేహం లేదు.

ఆస్తిపాస్తులకు
ఆనందానికి....
ఆనందం లేకపోవడానికి
పేదరికానికి.....
ఏ సంబంధమూ లేదు.

-మునిమడుగుల రాజారావు
7013577140

## 'కుటుంబం'పై అనే అంశంపై కవితాసంకలనానికి కవితలు ఆహ్వానం

'కుటుంబం' శీర్షికతో ప్రచురించబోయే కవితాసంకలనానికి ఉభయ రాష్ట్రాల కవులు, కవయిత్రులనుండి కవితలు ఆహ్వానిస్తున్నాము.

1) కవితలు ఇంతకు ముందు ఎక్కడా ప్రచురించలేదని హామీపత్రం జతపరచాలి, 2) పూర్తిపేరు, అడ్రసు, ఫోన్‌నెంబరు తప్పని సరిగా పంపాలి, 3) కవితల ఎంపికలో సంపాదకునిదే తుదినిర్ణయం,4) కవిత 20లైన్లకు మించరాదు, 5) ఒక్కొక్కరు ఒక్క కవిత మాత్రమే పంపాలి, 6) కవితలను గుదిబండి వెంకటరెడ్డి, జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, బి70/ఎఫ్ 1, పి.ఎస్.నగర్, విజయనగర్ కాలని, హైదరాబాద్-500057. తెలంగాణ రాష్ట్రం చిరునామాకు 30.11.2020లోపు పంపవలెను. తరువాత వచ్చిన కవితలు పరిశీలించబడవు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.